# పర్వతాలు మానవ అభివృద్ధి కేంద్రాలు

## ("అంతర్జాతీయ పర్వతాల దినం" సందర్భంగా)

ప్రపంచ జీవ వైవిధ్యంలో 15 శాతం వరకు జీవ జనాభా పర్వత ప్రాంతాల్లో నివసించడం, ప్రజా వినియోగానికి దాదాపు 50 శాతం తాగు నీటి(ప్రెష్ వాటర్)ని ప్రదానం చేసే కేంద్రాలుగా అమూల్యమైన సేవలు అందిస్తున్నాయి. పర్వతాల ప్రాధాన్యతలను గుర్తించిన ఐరాస 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030'లో వాటికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. వాతావరణ మార్పులు, పర్యావరణ కాలుష్యం, పర్వతాల దోపిడి లాంటి మానవ స్వార్థపూరిత కార్యాలతో పర్వతాల ఉనికిని ప్రమాదంలోకి నెట్టడం, పర్వతాలే నిరుపేద గిరిజన జాతుల ఆవాసాలుగా మారి సహకరిస్తున్నాయనే విషయాలను మరిచి పోవడం అత్యంత విచారకరం. మానవ ప్రమేయంతో పర్వతాల పతనం మానవాళినే కాకుండా, ప్రాణికోటి ఆరోగ్యకర జీవనాన్ని ప్రమాదంలోకి నెడుతున్నదని గమనించాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించుట, జీవవైవిధ్యాలకు నెలవులుగా నిలవడం, శుద్ధ జల కేంద్రాలుగా పర్వతాలు నిశ్శబ్ద విశిష్ట సేవలను అవిశ్రాంతంగా అందిస్తున్నాయి.

పర్వతాల ఎకోసిస్టమ్ పునరుద్ధణ:

పర్వతాల పరిరక్షణ అత్యంత ప్రధాన అంశమని భావించిన ఐక్యరాజ్యసమితి 2002 ఏడాదిని 'అంతర్జాతీయ పర్వత సంవత్సరం'గా ప్రకటించడంతో పాటు, ఐరాస సర్వసభ్య సమావేశ తీర్మానం ప్రకారం 2003 నుండి ప్రతి ఏట 11 డిసెంబరున 'అంతర్జాతీయ పర్వతాల దినం (ఇంటర్నేషనల్ మౌంటేయిన్ డే)' పాటించుట ఆనవాయితీగా మారింది. 'పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం (రీస్టోరింగ్ మౌంటెయిన్ ఎకోసిస్టమ్)' అనబడే నినాదంతో నిర్వహిస్తున్న ప్రపంచ పర్వతాల దినం-2023 వేదికగా ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు, మానవాళి హితానికి పర్వతాల చేస్తున్న మేలును అవగాహన చేయడం జరుగుతుంది.

### పర్వతాల ప్రయోజనాలు:

జీవనోపాధి, జీవవైవిధ్య పరిరక్షణ, సహజ ప్రకృతి అందాల వడ్డింపు, విలువైన ఉత్పత్తుల నెలవు, స్థానిక కళల ప్రోత్సాహం, గిరిజనుల ఉనికి లాంటి అంశాల్లో పర్వతాలు ప్రధాన భూమిక నిర్వహిస్తున్నాయి. ప్రపంచ పర్యాటకంలో 15-20 శాతం గ్లోబల్ టూరిజంను పర్వతాల అందాలు ఆకర్షిస్తున్నాయి. పర్వతాల సహజ వనరులను మానవాళి సంక్షేమం, పర్యావరణ హరిత పరిరక్షణ, ఆదాయ వనరుల వినియోగానికి పర్వతాలు ఉపకరిస్తాయనే సంపూర్ణ అవగాహన కలిగించడం అవసరంగా భావించి పర్వతాల దినం నిర్వహిస్తున్నారు. ప్రపంచ జీవ వైవిధ్యానికి ప్రధాన కేంద్రాలు, జీవ వైవిధ్య ఆరోగ్యకర మనుగడ, దాదాపు 80 శాతం ముఖ్య ఆహార ఉత్పత్తుల (మె?క్క జొన్న, పొటాటో, బార్లీ, టమాట, ఆపిల్, సొర్గమ్ లాంటివి) కేంద్రాలు, శుద్ధ జలం ఊటలుగా అనేక ఉపయోగాలను పర్వాతాలు మానవాళికి కల్పిస్తున్నాయని తెలుసుకోవాలి. పర్వతాల పరిరక్షణతో పేదరిక నిర్మూలన, జీవవైవిధ్య పరిరక్షణ, సహజ/సాంస్కృతిక/ఆధ్యాత్మిక కేంద్రాలు, విలువైన సంపదల తావులు, పర్యాటక అద్భుత దృశ్యాలు, సంప్రదాయ వేడుకలు వంటి మేలును మానవాళికి అందిస్తున్నాయి.

### పర్వతాల పరిరక్షణ:

పర్వతాల పరిరక్షణ, పర్వత విస్తరణ, పర్వతాల అభివృద్ధి, పర్యాటకాన్ని ప్రోత్సహించడం లాంటి అంశాలకు అధిక ప్రాధాన్యతలను ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. పర్వతాలను స్వార్థానికి విచ్ఛిన్నం చేయడం, పర్యాటకం పేరుతో పర్వతాల సహజ అందాల ఆకర్షణలకు భంగం కలిగించడం, మానవ ఆరోగ్య పరిరక్షణ, పర్వత ఉత్పత్తుల కోసం అతిగా వాడుకోవడం లాంటి దుశ్చర్యలు మానవాళి/జీవకోటి ఉనికికే ప్రమాదకరంగా మారుతాయని మరువరాదు. అంతర్జాతీయ పర్వత దినం వేదికగా పర్వత ప్రయోజనాల ఆధారంగా విద్యాలయాల్లో పోటీల నిర్వహణ, పర్వత పర్యాటక ప్రయాణాల నిర్వహణ, ఫోటో ప్రదర్శనలు, పర్వతారోహణ క్రీడల నిర్వహణ, మోటారు/సైకిల్/నడకల నిర్వహణ, పర్వతాల పాత్రను వివరించే అవగాహనలు లాంటి అనేక కార్యక్రమాలను నిర్వహించవచ్చు. వాటర్ సైక్లింగ్ (జల చక్రం), వ్యవసాయం, సహజ ఉత్పత్తులు, సకల జీవుల రక్షణ, వాతావరణ సానుకూల మార్పులు, జీవవైవిధ్య పరిరక్షణ అందాల విందులు, పర్వత ఆధార పరిశ్రమలు, జల విద్యుత్తు జననం, కాలుష్యాలను తగ్గించడం, గిరిజనుల నివాస కేంద్రాలుగా పర్వతాలు మానవాళి ప్రగతిలో తమ వంతు కర్తవ్యాలను అడక్కుండానే నిర్వహిస్తున్నాయి.

పర్వతాలు మానవాభివృద్ధికి రెక్కలని, ఆరోగ్య పరిరక్షణ ప్రదాతలని మరువకుండా, పర్వతాల అందాలను విచ్ఛిన్నం చేసే చేతులను/చోతలను అడ్డుకుంటూ, పర్వతగిరులను మన సహజ నేస్తాలుగా భావించి అక్కున చేర్చుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# వికసిత భారతం సంకల్ప యాత్ర గొప్ప మాధ్యమంగా మారింది

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ వికసిత భారతం సంకల్ప యాత్ర (విబిఎస్‌వై) లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా సంభాషించారు. ప్రభుత్వ పథకాల అమలులో సంతృప్త స్థాయి సాధనతోపాటు ప్రజలందరికీ సకాలంలో ప్రయోజనం అందించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వికసిత భారతం సంకల్ప యాత్ర చేపట్టబడింది.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి లబ్ధిదారులనుద్దేశించి ప్రసంగిస్తూ- ప్రతి గ్రామంలోనూ ప్రజలు ఎంతో ఉత్సాహంతో 'మోదీ హామీ రథాన్ని' స్వాగతించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు లబ్ధిదారులతో తన సంభాషణను గుర్తుచేస్తూ, ఈ యాత్రపై 1.5 లక్షల మందికిపైగా లబ్ధిదారులు తమ అనుభవాలను పొందుపరిచారని వెల్లడించారు. పక్కా ఇల్లు, కొళాయి కనెక్షన్, మరుగుదొడ్డి, ఉచిత చికిత్స, ఉచిత రేషన్, వంటగ్యాస్ కనెక్షన్, విద్యుత్ కనెక్షన్, బ్యాంకు ఖాతా ప్రారంభం సహా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం ఫసల్ బీమా యోజన, పీఎం స్వానిధి యోజన, పీఎం స్వామిత్వ ఆస్తి కార్డుల జారీ వంటి పథకాల ద్వారా పొందిన ప్రయోజనాల గురించి వారు వివరించారని పేర్కొన్నారు. దీనివల్ల దేశవ్యాప్తంగా కోట్లాది గ్రామీణ కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేకుండా తమకు అవసరమైన ప్రభుత్వ పథకాల లబ్ధి పొందినట్లు వివరించారు. ప్రభుత్వం లబ్ధిదారులను గుర్తించి ఆ తర్వాత వారికి లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపట్టిందన్నారు. "అందుకే ప్రజలు మోదీ హామీ అంటే- కచ్చితంగా నెరవేరే వాగ్దానంగా పరిగణిసున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

"దేశంలో ఇప్పటికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందని ప్రజలతో మమేకం కావడంలో వికసిత భారతం సంకల్ప యాత్ర గొప్ప మాధ్యమంగా మారింది'' అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 'విబిఎస్‌వై' నెలకన్నా తక్కువ వ్యవధిలోనే పలు నగరాలతోపాటు 40 వేలకుపైగా పంచాయతీలకు చేరిందని చెప్పారు. ఈ సందర్భంగా 1.25 కోట్ల మందికిపైగా ప్రజలు 'మోదీ హామీ రథం'తో మమేకమయ్యారని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ 'విబిఎస్‌వై' రథాన్ని ఎంతో ఉత్సాహంతో స్వాగతిస్తున్న ప్రజలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ప్రతిచోటా వివిధ కార్యకలాపాలు చేపడుతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పరిశుభ్రత కార్యక్రమం కింద ప్రభాత భేరి పేరిట అవగాహన కల్పన, పాఠశాలల్లో ప్రభాత ప్రార్థనల సందర్భంగా వికసిత భారతం కార్యక్రమంపై విద్యార్థుల నడుమ చర్చ, ప్రతి వాకిటా ముగ్గులు వేయడం, దీపాలు వెలిగించడం వంటి కార్యకలాపాల ద్వారా ప్రజా చైతన్యం మెరుగుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి పంచాయతీలోనూ 'విబిఎస్‌వై'కి స్వాగతం పలికడం కోసం ప్రత్యేక కమిటీల ఏర్పాటుపై ప్రధాని హర్షం వెలిబుచ్చారు. పాఠశాల విద్యార్థులతో పాటు వృద్ధులు కూడా పాల్గొనడం అభినందనీయమని, మొత్తంమీద ఈ సంకల్ప యాత్రం దేశం నలుమూలలకూ చేరుతున్నదని సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, ఒడిషాలోని వివిధ ప్రదేశాల్లో గిరిజన సంప్రదాయ నృత్యంతో యాత్రను స్వాగతిస్తున్న తీరును ప్రధాని ప్రశంసించారు. ఈ మేరకు పశ్చిమ ఖాసీ హిల్ పరిధిలోని రాంబ్రాయ్‌లో స్థానికులు నృత్యగానాలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. అలాగే అండమాన్-నికోబార్, లక్షద్వీప్ దీవులుసహా కార్గిల్‌లోనూ 'విబిఎస్‌వై'కి స్వాగతం పలికే కార్యక్రమాల్లో 4,000 మందికిపైగా ప్రజలు పాల్గొనడాన్ని కూడా ఆయన ఉదాహరించారు. 'విబిఎస్‌వై' రాకకు ముందు- తర్వాత పురోగతిని అంచనావేసే విధంగా కార్యకలాపాల జాబితా తయారీ కోసం కరదీపికను రూపొందించాలని ప్రధాని సూచించారు. తద్వారా "ఈ హామీ రథం వెళ్లాల్సిన ప్రాంతాల ప్రజలకు కూడా సమాచారం అందుతుంది" అని ఆయన అన్నారు.

గ్రామంలోకి 'మోదీ హామీ రథం' రాగానే ప్రతి వ్యక్తి అక్కడికి వచ్చి, ప్రభుత్వ పథకాల సంతృప్త స్థాయి సాధన సంకల్పం నెరవేరడంలో తమవంతు పాత్ర పోషించేలా ప్రభుత్వ చేస్తున్న కృషిని ప్రధానమంత్రి గుర్తుచేశారు. ఈ కృషి ప్రభావం ఇప్పుడు ప్రతి గ్రామంలోనూ కనిపిస్తున్నదని, ఉజ్వల పథకం కింద ఉచితంగా వంటగ్యాస్ కోసం కొత్తగా లక్షమంది నమోదు చేసుకోవడాన్ని శ్రీ మోదీ ఉదాహరించారు. అలాగే 35 లక్షలకుపైగా ఆయుష్మాన్ కార్డులు కూడా అక్కడికక్కడే జారీ చేయబడ్డాయని, లక్షలాది మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మరోవైపు వివిధ రోగ నిర్ధారణ పరీక్షల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయుష్మాన్ ఆరోగ్యాలయాలకు వెళుతున్నారని చెప్పారు.

"దేశ ప్రజలతో కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష సంబంధం, భావోద్వేగ బంధాన్ని మేం ఏర్పరిచాం" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఆ మేరకు "ఇది మా బాబు సర్కారు కాదు... దేశంలోని తల్లులు-తండ్రులందరికీ సేవలందించే ప్రభుత్వం" అని ఆయన అభివర్ణించారు. "మోదీకి నిరుపేదలు, అణగారిన వర్గాలు, ప్రభుత్వ కార్యాలయాల తలుపులు మూసివేయబడినవారు నాకు వీఐపీలే" అన్నారు. దేశంలోని ప్రతి పేదవాడినీ తాను అత్యంత ముఖ్యమైన వ్యక్తిగా పరిగణిస్తానని ఉద్ఘాటించారు. ఈ మేరకు "దేశంలోని ప్రతి తల్లి, సోదరి, కుమార్తె నాకు వీఐపీలే... ప్రతి రైతు, యువకుడు కూడా నాకు 'వీఐపీ'యే" అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో ముగిసిన శాసనసభల ఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ- 'మోదీ హామీ'కి లభించిన సుస్పష్ట ప్రజామోదానికి ఇవి నిదర్శనమని ప్రధాని పేర్కొన్నారు. ఈ మేరకు తనపై అపార నమ్మకం ప్రకటించిన ఓటర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వంపై అవాస్తవ ఆరోపణలు చేసేవారికి అదొక ప్రవృత్తి మాత్రమేనని, అందుకే వారిని విశ్వసించబోమని పౌరులు తమ తీర్పుతో స్పష్టం చేశారని ప్రధాని పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా కాకుండా ప్రజలకు చేరువ కావడం ద్వారా మాత్రమే ఎన్నికల్లో గెలుపు సాధ్యమని వ్యాఖ్యానించారు. "ఎన్నికలలో విజయానికన్నా ముందు జనం హృదయాలను చూరగొనడం అత్యంత ప్రధానం" అన్నారు. ప్రజా చైతన్యంపై అంచనాలో వారు బోల్తాపడటంపై తన సానుభూతి ప్రకటిస్తున్నానని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాలకు కాకుండా సేవా స్ఫూర్తికి ప్రాధాన్యం ఇచ్చి ఉంటే, దేశంలోని అధికశాతం జనాభా నేడు పేదరికంలో ఉండేది కాదన్నారు. ఇవాళ మోదీ నెరవేరుస్తున్న వాగ్దానాలు 50 ఏళ్ల కిందటే నెరవేరి ఉండేవని ప్రధాని వ్యాఖ్యానించారు.

దేశంలో మహిళా చోదక అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ- వికసిత భారతం సంకల్ప యాత్రలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడాన్ని ప్రధానమంత్రి ఉదాహరించారు. పిఎం ఆవాస్ యోజన కింద నిర్మించిన 4 కోట్ల పక్కా ఇళ్లలో 70 శాతం లబ్ధిదారులు మహిళలేనని ఆయన గుర్తుచేశారు. అలాగే ప్రతి 10 మంది ముద్ర లబ్ధిదారులలో 8 మంది మహిళలే ఉన్నారని, ఇక మహిళా స్వయం సహాయ సంఘాల్లో 10 కోట్ల మంది సభ్యులుగా ఉన్నారని ఉటంకించారు. మరోవైపు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం ద్వారా 2 కోట్ల మంది మహిళలు లక్షాధికారి సోదరీమణులుగా మారారని తెలిపారు. దేశంలోని 15 వేల స్వయం సహాయ సంఘాల్లోని మహిళలకు 'నమో డ్రోన్ సోదరీమణి కార్యక్రమం' కింద డ్రోన్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.

వికసిత భారతం సంకల్ప యాత్రకు నారీశక్తి, యువశక్తి, రైతులు, పేదలు విశేషంగా మద్దతివ్వడాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. యువ క్రీడాకారులను మరింత ప్రోత్సహించే ఈ యాత్రలో భాగంగా లక్ష మందికిపైగా వర్ధమాన క్రీడాకారులకు బహుమతులు అందించడం తనకెంతో సంతృప్తినిచ్చిందని ఆయన చెప్పారు. అలాగే 'మై భారత్ వాలంటీర్'గా నమోదు చేసుకోవడంలో యువత అపార ఉత్సాహం చూపుతున్నదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తద్వారా వికసిత భారతం సంకల్పం మరింత బలోపేతం కాగలదన్నారు. "ఈ స్వచ్ఛంద కార్యకర్తలందరూ ఇప్పుడు 'సుదృఢ భారతం' మంత్రాన్ని అనుసరిస్తూ ముందడుగు వేస్తారు" అని పేర్కొన్నారు. తగినంత నీరు, పోషకాహారం, కసరత్తు లేదా ఏదైనా వ్యాయామంతోపాటు చాలినంత నిద్ర కూడా అత్యావశ్యకమని ఈ సందర్భంగా ఆయన యువతకు సూచించారు. "ఆరోగ్యకర శరీరానికి ఈ నాలుగూ చాలా అవసరం. వీటిపై మనం శ్రద్ధ వహిస్తే యువతరం ఆరోగ్యంగా ఉంటుంది. వారు ఆరోగ్యవంతులుగా ఉంటేనే దేశం కూడా ఆరోగ్యంగా ఉంటుంది" అని ప్రధానమంత్రి ఉద్బోధించారు.

ఈ వికసిత భారతం సంకల్ప యాత్రలో చేసే ప్రమాణాలు జీవన మంత్రాలుగా మారాలని ప్రధాని ఉద్ఘాటించారు. "ప్రభుత్వ ఉద్యోగులైనా, ప్రజాప్రతినిధులైనా, పౌరులైనా ప్రతి ఒక్కరూ పూర్తి అంకితభావంతో ఏకం కావాలి. మనందరి సమష్టి కృషితోనే భారతదేశం అభివృద్ధి చెందుతుంది" అని శ్రీ మోదీ తన ప్రసంగం ముగించారు.

దేశవ్యాప్తంగాగల వికసిత భారతం సంకల్ప యాత్ర లబ్ధిదారులు వేలాదిగా వాస్తవిక సాదృశ మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే 2,000కుపైగా 'విబిఎస్‌వై' రథాలు, వేలాది వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు (కెవికె), సార్వత్రిక సేవా కేంద్రాలు (సిఎస్‌సి) కూడా ఈ కార్యక్రమంతో అనుసంధానితమయ్యాయి.

# మహిళలు ఎలాంటి సవాలునైనా స్వీకరించగలరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర లబ్ధిదారులతో సంభాషిం చారు. ఈ పథకాల ప్రయోజనాలు నిర్దేశిత లబ్ధిదారులందరికీ సమయానుకూలంగా చేరేలా చూడడం ద్వారా ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాల సంతృప్తిని పొందేందుకు దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర చేపట్టారు, తన భర్త ముంబైలో రోజువారీ కూలీగా పని చేస్తున్నారని, కోవిడ్ సమయంలో, తరువాత కుటుంబ ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిన తర్వాత, ఆమె వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్ పథకం, పీఎంజికేఏవై, జన్ ధన్ యోజన ప్రయోజనాలను పొందిందని ప్రధానికి తెలియజేసారు.

బీహార్‌లోని దర్భంగాకు చెందిన గృహిణి, విబిఎస్‌వై లబ్ధిదారు శ్రీమతి ప్రియాంక దేవి, తన భర్త ముంబైలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నారని మరియు ఆమె వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్ స్కీమ్, పిఎమ్‌జికెఎవై, జన్ ధన్ యోజన ప్రయోజనాలను పొందానని ప్రధానికి తెలియజేశారు.

# కాశ్మీర్‌లో శుభ ఆచారాలతో మోదీకి గ్యారెంటీ స్వాగతం

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర (విబిఎస్వై) లబ్ధిదారులతో సంభాషించారు. ఈ పథకాల ప్రయోజనాలు నిర్దేశిత లబ్ధిదారులందరికీ సమయానుకూలంగా చేరేలా చూడడం ద్వారా ప్రభుత్వ ప్రధాన పథకాల సంతృప్తిని పొందేందుకు దేశవ్యాప్తంగా విక్షిత్ భారత్ సంకల్ప్ యాత్ర చేపట్టారు.

జమ్మూ, కాశ్మీర్‌లోని షేక్ పురా నుండి పాల విక్రేత, విబిఎస్వై లబ్ధిదారురాలు శ్రీమతి నజియా నజీర్‌తో సంభాషిస్తూ, ప్రధాన మంత్రి ఆమె కుటుంబ సభ్యుల గురించి అడిగారు. తన భర్త ఆటోడ్రైవర్ అని, తన ఇద్దరు పిల్లలు యూటీలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని ఆమె బదులిచ్చారు.

గత సంవత్సరాలతో పోల్చితే తన గ్రామంలో స్పష్టమైన మార్పుల గురించి ప్రధాన మంత్రి అడిగినప్పుడు, నజియా నజీర్, ఒకప్పుడు నీటి సమస్యలు ఉన్న వారి ఇళ్లకు ఇప్పుడు పరిశుభ్రమైన, సురక్షితమైన నీటి సరఫరాతో కుళాయిలు వచ్చాయని, జల్ జీవన్ మిషన్ తమ కథను మలుపు తిప్పిందని అన్నారు. ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్ల ప్రయోజనాలు, పీఎంజికేఏవై ను మరో 5 సంవత్సరాలు పొడిగించినందుకు ఆమె ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ మోదీ తన గ్రామంలో విబిఎస్వై వ్యాన్ అనుభవం, ప్రభావం గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. కాశ్మీరీ సంస్కృతి ప్రకారం పవిత్రమైన సందర్భాలలో నిర్వహించే ఆచారాల ద్వారా ప్రజలు దీనిని స్వాగతిస్తున్నారని ఆమె బదులిచ్చారు.

శ్రీమతి నజియా నజీర్‌తో సంభాషించడంపై ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ పిల్లలను చదివించి, దేశాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతున్న కాశ్మీర్‌లోని మహిళా శక్తిపై విశ్వాసం వ్యక్తం చేశారు. జమ్మూ, కాశ్మీర్‌లో విబిఎస్వై పట్ల ఉన్న ఉత్సాహం దేశంలోని ఇతర ప్రాంతాలకు సానుకూల సందేశాన్ని పంపుతుందని పేర్కొంటూ, "మీ ఉత్సాహం నా బలానికి మూలం" అని అన్నారు. కొత్త తరాల ఉజ్వల భవిష్యత్తుకు ఇది హామీ అని ఆయన అన్నారు.

# గుజరాత్‌లోని భరూచ్‌కి చెందిన వికసిత భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారుడు, ఐటీఐ సర్టిఫికేట్ పొందిన రైతు అల్పేష్‌భాయ్ చందూభాయ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:వికసిత భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారులతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చూడాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారు.

ప్రధానమంత్రితో గుజరాత్‌లోని భరూచ్‌కి చెందిన వికసిత భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారుడు,ఐటీఐ సర్టిఫికెట్, హార్డ్ వేర్ ఇంజనీరింగ్ డిప్లొమా పొందిన రైతు శ్రీ అల్పేష్‌భాయ్ చందూభాయ్ నిజామా మాట్లాడారు. వ్యవసాయ రంగంలో ఎందుకు ప్రవేశించావు అని చందూ భాయ్ నిజామా ని ప్రధానమంత్రి ప్రశ్నించారు. చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి తనకు వారసత్వంగా సంక్రమించిన 40 ఎకరాల భూమిలో వ్యవసాయం చేపట్టానని చందూభాయ్ నిజామా వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల సహాయంతో సబ్సిడీ ధరకు వ్యవసాయ పనిముట్లు కొనుగోలు చేశానని ఆయన ప్రధానికి తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ కింద తనకు 3 లక్షల రూపాయల సబ్సిడీ అందిందని కూడా ఆయన వివరించారు. దీనికి స్పందించిన ప్రధానమంత్రి 'మీ అంత వయస్సులో ఉన్నప్పుడు నాకు లక్ష రూపాయలు ఎలా ఉంటాయో కూడా నాకు తెలీదు. మీరు లక్షల గురించి మాట్లాడుతున్నారు. మార్పు అంటే ఇదే' అని వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ సబ్సిడీ పొంది లబ్ధి పొందిన శ్రీ అల్పేష్‌భాయ్ చందూభాయ్ నిజామా ను అభినందించిన ప్రధానమంత్రి ఇతర రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పరికరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆత్మ (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) ప్రాజెక్టులతో తనకు 2008 నుంచి ఉన్న అనుబంధాన్ని ఆయన వివరించారు. ఆత్మ ద్వారా తాను ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల వ్యవసాయ పద్ధతుల గురించి తెలుసుకున్నానని శ్రీ అల్పేష్‌భాయ్ తెలిపారు. . భరూచ్‌లో ప్రధాని సమక్షంలో ఆత్మ ద్వారా తాను 'ఉత్తమ రైతు అవార్డు' అందుకున్న అంశాన్ని శ్రీ అల్పేష్‌భాయ్ గుర్తు చేసుకున్నారు.

పక్కనే చిరునవ్వులు చిందిస్తూ కనిపించిన శ్రీ అల్పేష్‌భాయ్ కుమార్తెను ప్రధానమంత్రి పలకరించారు. 'భారత్ మాతా కీ జై' అని అన్నారు. దీనికి స్పందించిన శ్రీ అల్పేష్‌భాయ్ కుమార్తె 'భారత్ మాతా కీ జై' అని నినదించారు. చుట్టుపక్కల ఉన్న ప్రజలు 'భారత్ మాతా కీ జై' అని నినాదం చేయడంతో ప్రధానమంత్రి ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీ అల్పేష్‌భాయ్ వంటి వారు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్న యువతకు స్ఫూర్తి అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. ఆధునిక పద్ధతులు, ఆవిష్కరణలు కొత్త ఆలోచనలతో పొలాల నుంచి మార్కెట్ (బీజ్ సే బజార్ తక్) వరకు మెరుగైన వాతావరణాన్ని అందిస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ''విద్యావంతులైన యువత వ్యవసాయం లోకి ప్రవేశించడం ప్రభుత్వ సంకల్పానికి బలాన్నిస్తుంది" అని ఆయన అన్నారు. వ్యవసాయంలో డ్రోన్లు వినియోగించాలని రైతులకు ప్రధానమంత్రి సూచించారు. . త్వరలో 5 గ్రామాలకు రానున్న 'మోడి కి గ్యారెంటీ' వాహనానికి భారీ స్వాగతం పలకాలని ప్రధానమంత్రి కోరారు.

# శివనామ స్మరణతో మారుమోగుతున్న శైవ క్షేత్రాలు..



హైదరాబాద్, డిసెంబర్ 11: కార్తికమాసం చివరి సోమవారం సందర్భంగా ఎపి , తెలంగాణ రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు కిటకిటలాడుతున్నాయి. వేములవాడ, శ్రీశైలం, అమరావతి, ద్రాక్షారామంతో పాటు ప్రధానాలయాలకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేములవాడతోపాటు ప్రధానాలయాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో కార్తిక దీపాలను వెలిగించారు. దీంతో ఎములాడ రాజన్న దర్శనానికి మూడు గంటలకుపైగా సమయం పడుతున్నది. ఇక ఇక భద్రాచలంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను వెలిగించారు. వాటిని నదిలో వదిలారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు.

ఎపిలోని కృష్ణా, గోదావరి నదుల్లో పుణ్యస్నానాలు చేశారు. దీంతో విజయవాడలోని దుర్గా ఘాట్ వద్ద రద్దీ నెలకొంది. రాజమహేంద్రవరం, భద్రాచలంలో గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. దీపాలను వెలిగించి నదుల్లో వదిలారు. శ్రీకాళహస్తిలో శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం స్వర్ణముఖి నదిలోకి కార్తీక దీపాలు వదిలిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

చివరి రోజుతో పాటు చివరి సోమవారం కావడంతో శ్రీశైల మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడి పాతాళగంగలో పుణ్యస్నానాలను ఆచరించారు. గంగాధర మండపం, ఉత్తర శివమాడ వీధిలో కార్తీక దీపాలను వెలిగించారు. భక్తుల రద్దీ దృష్ట్యా స్వామివారి అలంకార దర్శనానికి మాత్రమే భక్తులను అనుమతించారు.

తిరుపతిలో కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో కపిల తీర్థం ఆలయం జలపాతం వద్ద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, దీపారాధన చేశారు. ఇందుకోసం టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

పంచారామాలలో పోటెత్తిన భక్త జనం

కార్తీక మాసం ఆఖరి సోమవారం పంచారామాలు భక్తులతో పోటెత్తాయి.. గోదావరి ఘాట్‌లో భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించారు. రాజమండ్రిలో ఉమా మార్కండేయ స్వామి ఆలయం భక్తజన సందోహంతో కిటకిటలాడుతోంది. పంచారామ క్షేత్రమైన ద్రాక్షారామంకు తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి పెరిగింది. ద్రాక్షారామ భీమేశ్వరునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పాలకొల్లు పంచారామ క్షేత్రం శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. స్వామి వారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

# 17న రాజధాని రైతుల బహిరంగ సభ.. పాల్గొననున్న చంద్రబాబు, పవన్



తిరుపతి, డిసెంబర్ 11:ఈనెల 17న అమరావతిలో రాజధాని రైతులు భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ హాజరుకానున్నారు. అమరావతి ఉద్యమం ప్రారంభమై నాలుగేళ్లు కావొస్తున్న సందర్భంగా రైతులు సభను ఏర్పాటు చేశారు.

ఈ మేరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట సభను నిర్వహించేందుకు రైతులు సిద్ధం అవుతున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సభా ఏర్పాట్లపై ఇవాళ అమరావతి, తుళ్లూరు రైతులు సమావేశమయ్యారు.



# ప్రపంచంలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్ మార్కెట్లలో భారత్ ఒకటి

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ సాంకేతికార్థిక రంగంలో ప్రపంచ మేధా నాయకత్వ వేదికైన ఇన్ఫినిటీ ఫోరమ్ రెండో సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని ఉజ్వల గుజరాత్ ప్రపంచ సదస్సు-2024కు సన్నాహకంగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రాల ప్రాధికార సంస్థ (ఐఎఫ్ఎస్‌సిఏ), 'గిఫ్ట్' సిటీ సంయుక్తంగా నిర్వహించాయి. 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి: నవతరం ప్రపంచ ఆర్థిక సేవలకు జీవనాడి' ఇతివృత్తంగా ఇన్ఫినిటీ ఫోరమ్ 2.0 సమావేశం ఏర్పాటు చేయబడింది.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ- 2021 డిసెంబరులో ఇన్ఫినిటీ ఫోరమ్ తొలి సదస్సు సమయంలో మహమ్మారి ప్రభావిత ప్రపంచం ఆర్థిక అనిశ్చితితో దెబ్బతిన్నదని గుర్తు చేసుకున్నారు. ఆనాటి ఆందోళనకర పరిస్థితులు ఇంకా పూర్తిగా సమసిపోలేదని పేర్కొన్నారు. దీనికితోడు నేటి భౌగోళిక- రాజకీయ ఉద్రిక్తతలు, అధికస్థాయి ద్రవ్యోల్బణం, పెరుగుతున్న రుణభారం వంటి సవాళ్లు పీడిస్తున్నా పునరుత్థానం, పురోగమనానికి చిహ్నంగా భారత్ ఆవిర్భవించిందని ప్రధాని ప్రముఖంగా వివరించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి కార్యక్రమాన్ని గిఫ్ట్ సిటీలో నిర్వహించడం ద్వారా గుజరాత్ ప్రభుత్వ ప్రతిష్ఠ కొత్త శిఖరాలకు చేరుతున్నదని పేర్కొన్నారు. గుజరాత్ సొంతమైన 'గర్బా' నాట్యం యునెస్కో అదృశ్య సాంస్కృతిక వారసత్వ సంపద జాబితాలో స్థానం పొందిన సందర్భంగా రాష్ట్ర ప్రజలను ప్రధాని అభినందించారు. "గుజరాత్ విజయం యావద్దేశానికీ విజయం" అని వ్యాఖ్యానించారు.

దేశంలో విధానాలు, సుపరిపాలన, పౌర సంక్షేమం వగైరాలకు ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమిచ్చిన ఫలితంగానే వృద్ధి పథంలో భారత పురోగమనం సాధ్యమైందని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. గత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో భారత వృద్ధి 7.7 శాతంగా నమోదైందని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది (2023) ప్రపంచ వృద్ధి 16 శాతంగా నమోదైతే, అందులో భారత్ వాటా గణనీయ స్థాయిలో ఉన్నట్లు అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకటించడాన్ని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే "అంతర్జాతీయ సవాళ్ల నడుమ భారత ఆర్థిక వ్యవస్థపై అంచనాలు అత్యధిక స్థాయిలో ఉన్నాయి" అని ప్రపంచ బ్యాంకు పేర్కొనడాన్ని ఆయన ఉటంకించారు. దక్షిణార్ధ గోళ దేశాలకు భారత నాయకత్వం కీలకమని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ప్రకటించడాన్ని కూడా శ్రీ మోదీ గుర్తుచేశారు. అదేవిధంగా అనవసర ఆలస్యం జాడ్యంపై నియంత్రణతో భారతదేశంలో పెట్టుబడి అవకాశాలు మెరుగుపడ్డాయని ప్రపంచ ఆర్థిక వేదిక వ్యాఖ్యానించడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. నానాటికీ బలపడుతున్న ఆర్థిక వ్యవస్థ, దశాబ్దం నుంచీ అమలవుతున్న పరివర్తనాత్మక సంస్కరణల వల్ల భారతదేశం ప్రపంచానికి ఆశాకిరణంగా మారిందని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ప్రపంచంలోని ఇతర దేశాలు ఆర్థిక-ద్రవ్యపరమైన ఊరటపై దృష్టి సారించిన వేళ దీర్ఘకాలిక వృద్ధి-ఆర్థిక సామర్థ్య విస్తరణపై దృష్టి సారించిన ఘనత మన దేశానికే దక్కిందని వ్యాఖ్యానించారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో ఏకీకరణ పెంపు లక్ష్యం గురించి ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ దిశగా సాధించిన విజయాలకు అనేక రంగాల్లో సానుకూల 'ఎఫ్‌డిఐ' విధానం, సమ్మతి భారంనుంచి ఊరట వంటి చర్యలు సహా ఇవాళ 3 'ఎఫ్‌టిఏ'లపై సంతకాలు చేయడం వంటివి దోహదం చేశాయని వివరించారు. 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సిఏ' అన్నది భారత-ప్రపంచ ఆర్థిక విపణులను ఏకీకృతం చేసే ఓ కీలక సంస్కరణలో భాగమని ఆయన చెప్పారు. కాబట్టే "అంతర్జాతీయ ఆర్థిక రంగ నేపథ్యాన్ని పునర్నిర్వచించే గతిశీల పర్యావరణ వ్యవస్థగా గిఫ్ట్ సిటీ పరిగణించబడుతోంది" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ఇది ఆవిష్కరణ, సామర్థ్యం, ప్రపంచ సహకారం సంబంధిత అంశాల్లో కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తుందని స్పష్టం చేశారు. ఏకీకృత నియంత్రణ వ్యవస్థగా 2020లో అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రాల ప్రాధికార సంస్థ (ఐఎఫ్ఎస్‌సిఏ) ఏర్పాటును ఓ కీలక మైలురాయిగా ఆయన పేర్కొన్నారు. ఆ ప్రస్తుత ఆర్థిక సంక్షోభ సమయంలో 'ఐఎఫ్ఎస్‌సిఏ' 27 నిబంధనలు, 10కిపైగా చట్రాలను రూపొందించి పెట్టుబడికి కొత్త బాటలు పరిచిందని ఆయన తెలిపారు. ఇన్ఫినిటీ ఫోరమ్ తొలి సమావేశం సందర్భంగా అందిన సూచనలను పరిగణనలోకి తీసుకోవడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు 2022 ఏప్రిల్ నెలలో ఫండ్ల నిర్వహణ కార్యకలాపాల సమగ్ర నియంత్రణ చట్రాన్ని 'ఐఎఫ్ఎస్‌సిఏ' ప్రకటించడాన్ని ఆయన ఉదాహరించారు. దీనికింద నేడు 80 ఫండ్ నిర్వహణ సంస్థలు 'ఐఎఫ్ఎస్‌సిఏ' చట్రం కింద నమోదైనట్లు ప్రధాని వెల్లడించారు. తదనుగుణంగా 24 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడితో ఫండ్ నిర్వహణ సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అలాగే 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి'లో 2024 నుంచి కోర్సులు ప్రారంభించేందుకు రెండు ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు ఆమోదం పొందాయని తెలిపారు. అలాగే 2022 మే నెలలో 'ఐఎఫ్ఎస్‌సిఏ' విమాన లీజుల చట్రం ప్రకటించడాన్ని, దానికింద ఇప్పటిదాకా 26 యూనిట్లు కార్యకలాపాలు ప్రారంభించడాన్ని కూడా ప్రధాని ప్రస్తావించారు.

'ఐఎఫ్ఎస్‌సిఏ' పరిధి విస్తరణను ప్రస్తావిస్తూ- ఇందుకోసం 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సిఏ'ని సంప్రదాయ ఫైనాన్స్-వెంచర్లకు అతీతంగా రూపొందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ఆయన పునరుద్ఘాటించారు. "గిఫ్ట్ సిటీని మేం నవతరం ప్రపంచ సాంకేతికార్థిక సేవల అంతర్జాతీయ జీవనాడిగా మార్చాలని భావిస్తున్నాం" అని పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో గిఫ్ట్ సిటీ ఉత్పత్తులు-సేవలు తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ, ఇందులో భాగస్వాములు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని శ్రీ మోదీ అన్నారు.

ఇక వాతావరణ మార్పు పెనుసవాలును సమావేశం దృష్టికి తెస్తూ- ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా ఈ విషయంలో భారత్ ఆందోళనను ప్రధాని ప్రస్తావించారు. దీనికి సంబంధించి ఇటీవలి కాప్-28 శిఖరాగ్ర సదస్సులో భారత్ ప్రకటించిన లక్ష్యాలను గుర్తుచేశారు. ఇందులో భారత్ సహా ప్రపంచం ముందున్న లక్ష్యాల సాధన కోసం చౌకవ్యయంతో తగుమేర ఆర్థిక సహాయంపై భరోసా లభించాల్సి ఉందని స్పష్టం చేశారు. భారత జి-20 అధ్యక్షత సమయంలో ప్రాధాన్యాంశమైన ప్రపంచ వృద్ధి, నిలకడ కోసం సుస్థిర ఆర్థిక సహాయం ఆవశ్యకతను ప్రపంచ దేశాలు అర్థం చేసుకోవాల్సి ఉందన్నారు. తద్వారా మరింత సార్వజనీన, హరిత, మరింత పునరుత్థాన సమాజాలు, ఆర్థిక వ్యవస్థల వికాసానికి ప్రోత్సాహం లభిస్తుందని స్పష్టం చేశారు. కొన్ని అంచనాల ప్రకారం 2070 నాటికి భారత్ నికర శూన్య ఉద్గార స్థాయిని సాధించాలంటే కనీసం 10 ట్రిలియన్ డాలర్ల మేర నిధులు కావాల్సి ఉందన్నారు. ఇందులో అధిక శాతం ప్రపంచ ఆర్థిక వనరుల నుంచి సమకూర్చుకోవాల్సి ఉంటుందని ప్రధాని చెప్పారు. ఈ నేపథ్యంలో 'ఐఎఫ్ఎస్‌సి'ని సుస్థిర ఆర్థిక సహాయ కూడలిగా రూపొందించాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. భారతదేశాన్ని స్వల్ప కర్బన ఆర్థిక వ్యవస్థగా మార్చడానికి అవసరమైన హరిత మూలధన ప్రవాహం కోసం 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి' ఒక సమర్థ మాధ్యమం. నిర్దేశిత లక్ష్యాల సాధన దిశగా 'గ్రీన్ బాండ్స్, సస్టెయినబుల్ బాండ్స్, సస్టెయినబిలిటీ లింక్డ్ బాండ్స్' వంటి ద్రవ్య ఉత్పత్తుల రూపకల్పన ప్రపంచానికి మార్గం సుగమం చేయగలదు" అని ఆయన సూచించారు. ఇక కాప్-28లో భారత్ భూగోళ హిత 'ప్రపంచ హరిత క్రెడిట్ కార్యక్రమం' అమలుకు ప్రతిపాదించిందని గుర్తుచేశారు. దీనికి సంబంధించి 'గ్రీన్ క్రెడిట్' విపణిని రూపొందించేందుకు పారిశ్రామిక దిగ్గజాలు వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలని శ్రీ మోదీ పిలుపునిచ్చారు.

సాంకేతికార్థిక రంగంలో భారత్ సామర్థ్యం 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి' దార్శనికతకు సమాంతరంగా ఉంటుందని వివరిస్తూ- "ప్రపంచంలో నేడు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సాంకేతికార్థిక విపణులలో భారత్ కూడా ఒకటి" అని ప్రధాని ప్రకటించారు. కాబట్టే భారత్ ఎంతో వేగంతో సాంకేతికార్థిక కూడలిగా రూపొందుతున్నదని చెప్పారు. సాంకేతికార్థిక రంగం కోసం 2022లో 'ఐఎఫ్ఎస్‌సిఏ' రూపొందించిన ప్రగతిశీల నియంత్రణ చట్రం అమలుతో సాధించిన విజయాలను ప్రధాని వివరించారు. అలాగే ఆవిష్కరణలు-వ్యవస్థాపనకు ప్రేరణనిచ్చేలా భారత, విదేశీ సాంకేతికార్థిక సంస్థల కోసం 'ఐఎఫ్ఎస్‌సిఏ సాంకేతికార్థిక ప్రోత్సాహక పథకం' ప్రవేశపెట్టిందని ప్రధాని గుర్తుచేశారు. అంతర్జాతీయ సాంకేతికార్థిక రంగానికి సింహద్వారంగా, ప్రపంచ సాంకేతికార్థిక ప్రయోగశాలగా రూపొందే సామర్థ్యం గిఫ్ట్ సిటీకి ఉందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని గరిష్ఠ స్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రధాని పెట్టుబడిదారులను కోరారు.

గిఫ్ట్ సిటీ ప్రపంచ మూలధన ప్రవాహానికి ముఖద్వారంగా రూపొందే అవకాశాలను ప్రస్తావిస్తూ- దీనికి సంబంధించి 'నగర త్రయం' భావన గురించి ప్రధాని వివరించారు. అటు రాష్ట్ర రాజధాని గాంధీనగర్, ఇటు చారిత్రక అహ్మదాబాద్ నగరంతో గిఫ్ట్ సిటీకి అద్భుత అనుసంధానం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా 'వ్యాపార సంస్థలు తమ సామర్థ్యం పెంచుకోవడంలో 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి'లోని అత్యాధునిక డిజిటల్ మౌలిక సదుపాయాలు ఒక వేదికను సమకూర్స్తాయి" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు సాంకేతిక, ఆర్థిక ప్రపంచంలోని అత్యంత ప్రతిభావంతులను ఆకర్షించగల అయస్కాంతంగా 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి' ఆవిర్భవించిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం ఇక్కడ 58 సంస్థలు, అంతర్జాతీయ బులియన్ ఎక్స్ఛేంజీ సహా 3 ఎక్స్ఛేంజీలు, 9 విదేశీ బ్యాంకులు సహా 25 బ్యాంకులు, 29 బీమా సంస్థలు, 2 విదేశీ విశ్వవిద్యాలయాలు, సంప్రదింపు సంస్థలు, న్యాయసేవా సంస్థలు, చార్టర్డ్ అకౌంటెన్సీ సంస్థలు సహా 50కిపైగా వృత్తి నైపుణ్య సేవా సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే కొన్నేళ్లలోనే గిఫ్ట్ సిటీ అత్యుత్తమ అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాల్లో ఒకటిగా ఆవిర్భవించగలదని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

"చారిత్రక వ్యాపార-వాణిజ్య సంప్రదాయాలు, లోతైన ప్రజాస్వామ్య విలువలకు భారతదేశం నెలవు" అని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. భారతదేశంలో ప్రతి కంపెనీకి, పెట్టుబడిదారుకుగల విభిన్న అవకాశాలను వివరిస్తూ- గిఫ్ట్ సిటీపై భారత దార్శనికత భారత వృద్ధి పయనంతో ముడిపడి ఉందని ప్రధాని చెప్పారు. ఇందుకు కొన్ని ఉదాహరణలిస్తూ- ఇక్కడికి నిత్యం 4 లక్షల మంది విమాన ప్రయాణికుల రాకపోకలు సాగుతున్నాయని గుర్తుచేశారు. అలాగే 2014 ప్రయాణిక విమానాల సంఖ్య 400 కాగా, నేడు 700 దాటిందని పేర్కొన్నారు. అంతేకాకుండా గడచిన తొమ్మిదేళ్లలో దేశంలోని విమానాశ్రయాల సంఖ్య రెట్టింపైందని చెప్పారు. "మన విమానయాన సంస్థలు రాబోయే కాలంలో సుమారు 1000 విమానాలను కొనుగోలు చేయనున్నాయి" అంటూ గిఫ్ట్ సిటీ ద్వారా లభించే సదుపాయాలపై విమాన లీజుదారులకు ప్రధాని విస్తృత సమాచారం ఇచ్చారు. దీంతోపాటు 'ఐఎఫ్ఎస్‌సిఏ' ఓడల లీజు చట్రం, ఐటి ప్రతిభావంతుల భారీ నిధి, సమాచార రక్షణ చట్టాలు సహా గిఫ్ట్ సిటీలోని సమాచార రాయబార కార్యాలయం ఏర్పాటుతో అన్ని దేశాలు, వ్యాపారాలకు నిరంతర డిజిటల్ అనుసంధానం సహా సురక్షిత సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. "భారత యువ ప్రతిభతో అన్నిరకాల పెద్ద కంపెనీలకు అంతర్జాతీయ సామర్థ్య కేంద్రంగా మనం రూపొందడం హర్షణీయం" అని ఆయన చెప్పారు.

చివరగా- రాబోయే కొన్నేళ్లలో భారతదేశం ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి వికసిత భారతంగా రూపొందుతుందని ప్రధానమంత్రి భరోసా ఇచ్చారు. ఈ ప్రగతి పయనంలో కొత్తరకం మూలధనం, డిజిటల్ సాంకేతికతలు, నవతరం ఆర్థిక సేవల పాత్రను కూడా ఆయన నొక్కిచెప్పారు. సమర్థ నిబంధనలు, తక్షణ వినియోగ మౌలిక సదుపాయాలు, అతిపెద్ద భారతీయ అంతర్గత ఆర్థిక వ్యవస్థ సౌలభ్యం, కార్యకలాపాల చౌక వ్యయం, ప్రతిభ లభ్యత వంటి దీటైన అవకాశాలను గిఫ్ట్ సిటీ సృష్టిస్తోందని ఆయన వివరించారు. "ప్రపంచ స్వప్నాలను సాకారం చేయడానికి 'గిఫ్ట్-ఐఎఫ్ఎస్‌సి'తో జట్టుగా ముందడుగు వేద్దాం. మరోవైపు ఉజ్వల గుజరాత్ సదస్సు కూడా త్వరలోనే జరగనుంది" అంటూ పెట్టుబడిదారులందరికీ ఆయన ఆహ్వానం పలికారు. "ప్రపంచంలోని తీవ్ర సమస్యలకు పరిష్కారాన్వేషణలో భాగంగా వినూత్న ఆలోచనలు చేయడంలోపాటు వాటిని సమర్థంగా అనుసరిద్దాం" అంటూ శ్రీ మోదీ తన ప్రసంగం ముగించారు.

ఇన్ఫినిటీ ఫోరమ్ 2.0ను ఉజ్వల గుజరాత్ ప్రపంచ సదస్సు-2024కు సన్నాహకంగా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో అంతర్జాతీయ ఆర్థిక సేవా కేంద్రాల ప్రాధికార సంస్థ (ఐఎఫ్ఎస్‌సిఏ), 'గిఫ్ట్ సిటీ' సంయుక్తంగా నిర్వహించాయి. ప్రపంచవ్యాప్త ప్రగతిశీల ఆలోచనలు, తీవ్ర మస్యలు, వినూత్న సాంకేతికతల అన్వేషణ, చర్చలు, పరిష్కారాలు, అవకాశాల రూపకల్పనకు ఇన్ఫినిటీ ఫోరమ్ 2.0 ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

ప్రతి ట్రాక్‌లో ఒక సీనియర్ పారిశ్రామిక అగ్రగామి ప్రతినిధి ఇన్ఫినిటీ ప్రసంగంతోపాటు భారత్ సహా ప్రపంచవ్యాప్త ఆర్థికరంగ పరిశ్రమ నిపుణులు-వృత్తిదారులతో బృంద చర్చ కూడా ఉంటుంది. ఇది ఆచరణాత్మక ఆలోచనలను, అనుసరణీయ పరిష్కారాలను సూచిస్తుంది.

అలాగే ఇన్ఫినిటీ వేదికపై భారతదేశంతోపాటు అమెరికా, యుకె, సింగపూర్, దక్షిణాఫ్రికా, యుఎఇ, ఆస్ట్రేలియా, జర్మనీ సహా 20కిపైగా ప్రపంచ దేశాల నుంచి 300 మందికిపైగా 'సిఎక్స్ఒ' ప్రతినిధులతో కూడిన బలమైన ఆన్‌లైన్ ప్రేక్షక భాగస్వామ్యం ఉంటుంది. ఈ కార్యక్రమానికి విదేశీ విశ్వవిద్యాలయాల ఉప-కులపతులు, విదేశీ రాయబార కార్యాలయాల ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు.

### ఆరోగ్యశ్రీ సేవలపై విస్తృత ప్రచారం..

# ఈనెల 18 నుంచి కొత్త కార్డుల పంపిణీ

అమరావతి, డిసెంబర్ 11:వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీతో పేదవాడికి ఆరోగ్య భరోసా లభిస్తోంది. ముఖ్యమంత్రి వైయస్.జగన్ పాలనలో అత్యంత బలోపేతమైన వైయస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.25లక్షల వరకూ ఉచితంగా వైద్యం అందుతోంది.

క్యాన్సర్ లాంటి తీవ్ర వ్యాధులతో బాధపడేవారికి రూ.25 లక్షలు ఖర్చైనా ప్రభుత్వం ఆ చికిత్సల బారాన్ని మొత్తంగా స్వీకరిస్తోంది. గతంలో క్యాన్సర్ చికిత్సలకు ఆరోగ్యశ్రీ కింద ఇచ్చే డబ్బుపై రూ.5 లక్షల పరిమితి ఉండేది. అయితే ఈ ప్రభుత్వం ఈ పరిమితిని ఎత్తివేస్తూ వారికి పూర్తివైద్యాన్ని అందిస్తోంది. ఇలాంటి ఖరీదైన ప్రొసీజర్ల కోసమే రూ.1,897.86 కోట్లు ఈ ప్రభుత్వం ఖర్చు చేసింది.

బైలెటరల్ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ కోసం రూ. 11,97,248 వరకూ ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా చికిత్స అందుతోంది. అలాగే స్టెమ్సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం రూ.11 లక్షలు, గుండె మార్పిడి కోసం రూ. 10,77,510? ఇలా ఖరీదైన ప్రొసీజర్లకోసం వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద జగనన్న ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందించింది. వైయస్సార్ ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా ఇలాంటి వైద్యాన్ని పొందడం ఎలా అన్నదానిపై అవగాహన కల్పించడంపై ఇప్పుడు ప్రభుత్వం దృష్టిపెట్టింది.

విస్తరించిన సేవలు, గణనీయంగా పెరిగిన ప్రొసీజర్లతో ఆరోగ్య శ్రీ సేవలను అత్యంత సులభంగా అందుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18 నుంచి భారీ ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అదే రోజున కొత్తగా రూపొందించిన ఆరోగ్య శ్రీకార్డులను గడపగడపకూ అందించడంతోపాటు, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే యాప్‌ను కూడా సెల్‌ఫోన్లలో డౌన్లోడ్ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మున్నెన్నడూ లేని విధంగా ఇందులో ఎమ్మెల్యేలు పాల్గోవాలని సీఎం జగన్ ఆదేశించారు.

పేదల రోగులకు చేయూతనిస్తూ ఆరోగ్య ఆసరా పేరిట వైయస్.జగన్ మరో విప్లవాత్మక పథకాన్ని తీసుకు వచ్చారు. చికిత్స తర్వాత రోగులు తీసుకునే విశ్రాంతి కాలానికి అండగా నిలుస్తూ దేశంలోని ఎక్కడా లేని విధంగా ఆరోగ్య ఆసరా పథకాన్ని తీసుకు వచ్చారు. రోజుకు కనీసంగా రూ.225లు, గరిష్టంగా నెలకు రూ.5వేల వరకూ చెల్లిస్తోంది. దీంతో అనారోగ్యం కారణంగా ఉపాధి పొందలేని పరిస్థితుల్లో వారికి ఈడబ్బు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఈ ఒక్క ఆసరా కిందే ఇప్పటివరకూ 25,27,870 మంది రూ.1309.9 కోట్ల రూపాయలు అందుకున్నారు.

సరికొత్త ఫీచర్లతో

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ లబ్ధిదారులు 1,42,34,464 ఉందన్నారు. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ సరికొత్త కార్డులో మంచి ఫీచర్లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతికార్డులో కూడా క్యూఆర్ కార్డు, లబ్ధిదారుని ఫొటో ఉంటుంది. యూనిక్ హెల్త్ ఐడెంటిటీ నంబరు కూడా ఉంటుంది. కుటుంబ యజమాని పేరు, జిల్లా, మండలం, సబంధిత సెక్రటేరియట్ పేరు కార్డుకు ఒకవైపున రెసిడెంట్ ఐడీ, కుటుంబ సభ్యుల పేర్లు వెనుకవైపు ఉంటాయి.

కార్డులో ఉండే క్యూ ఆర్ కార్డు ద్వారా విశేషమైన ప్రయోజనాలు ఉన్నాయి. రోగి చేయించుకునే వ్యాధినిర్ధారణ పరీక్షలు, తీసుకుంటున్న వైద్యం, చికిత్సలు, డాక్టరు సిఫార్సులు ఈ సమాచారం అంతాకూడా ఐఉఉ లో నిక్షిప్తమై ఉంటుంది.

దీనివల్ల రోగి యొక్క ఆరోగ్య పరిస్థితిన క్యూఆర్ కోడ్ ద్వారా గతంలో చేసుకున్న పరీక్షలు, తీసుకున్న మందులు, చికిత్సలు, వైద్యుల సిఫార్సులు, సూచనలన్నీ వెంటనే తెలుసుకునే అవకాశం ఉటుంది. దీనివల్ల రోగి ఆరోగ్య పరిస్థితులపై డాక్టర్లకు, సిబ్బందికి వెనువెంటనే అవగాహన వస్తుంది. దీనివల్ల వైద్యం అందించడం మరింత సులభతరం అవుతుంది.

ఆరోగ్య శ్రీ పరిధిలోకి మరింత మంది ప్రయోజనం కల్పించేలా ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం బీపీఎల్ కుటుంబాలకే కాకుండా ఏడాదికి రూ.5 లక్షల ఆలోపు ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరికీ కూడా పథకాన్ని వర్తింపుచేసింది. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న లబ్ధిదారులు దరఖాస్తు చేసి ఆరోగ్య శ్రీకార్డులను పెద్ద మొత్తంలో పొందారు.

# మూడు నెలల్లో హిట్లర్ పాలన అంతం.. ప్రజా పాలన ప్రారంభం - లోకేష్



కాకినాడ, డిసెంబర్ 11: మూడు నెలల్లో హిట్లర్ పాలన పోతుందని, తాము అధికారంలోకి వస్తామని, మళ్లీ పరిశ్రమలు తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ .యువగళం పాదయాత్రలో భాగంగా కాకినాడ సెజ్ బాధిత రైతులతో నారా లోకేష్ ముఖాముఖి మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పరిశ్రమలను వైకాపా ప్రభుత్వం తరిమేసిందని విమర్శించారు. రాష్ట్రంలో పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సి ఉందన్నారు.

" తక్కువ కాలుష్యంతో పరిశ్రమలను తీసుకొచ్చే బాధ్యత తెదేపా తీసుకుంటుంది. పరిశ్రమలు వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి. స్థానికులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తాం. తెదేపా హయాంలో తీసుకొచ్చిన కియా పరిశ్రమ వల్ల వేలాది మంది జీవితాల్లో మార్పు వచ్చింది. పరిశ్రమలు వస్తే గ్రామాల రూపురేఖలు మారిపోతాయి. ఆక్వా రంగంలో 10 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆక్వా ఉద్యోగులు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఫోన్ల పరిశ్రమ తీసుకొచ్చా. ఆ పరిశ్రమలో 6వేల మంది పని చేసేవారు" అని లోకేష్ గుర్తు చేశారు. న్యాయం చేయాలని ప్రశ్నించిన వారిని వైకాపా ప్రభుత్వం హింసిస్తోందన్న లోకేష్.. మూడు నెలల్లో ప్రజల ప్రభుత్వం ఏర్పడబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

# జనసేన ధర్నా... నాదెండ్ల మనోహర్ అరెస్ట్

అమరావతి, డిసెంబర్ 11:టైకూన్ కూడలిలో రోడ్డు మూసివేతను నిరసిస్తూ మనోహర్ నేతృత్వంలో జనసేన ధర్నాచేపట్టింది. ఈ సందర్భంగా ఈ ధర్నాలో పాల్గొన్న జనసేన రాజకీయా వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ను వైజాగ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు ఇతర జనసేన నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనంలో అక్కడి నుంచి తరలించారు. అరెస్ట్ అయిన నాదేండ్ల మిడియాతో మాట్లాడుతూ, వైసీపీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రియలెస్టేట్ వ్యాపారంలో భాగంగా నిర్మిస్తున్న కట్టడానికి వాస్తు బాగోలేదని రోడ్డును మూసేశారని ఈ సందర్భంగా మనోహర్ మండిపడ్డారు. వైసీపీ నేతల నిర్మాణాలకు వాస్తు దోషం ఉంటే రోడ్లను మూసేస్తారా అని ప్రశ్నించారు. తమ ధర్నా రాజకీయ కార్యక్రమం కాదని. శాంతియుతంగా చేస్తున్న నిరసన కార్యక్రమమని మనోహర్ చెప్పారు.

తమ ధర్నా కార్యక్రమం గురించి తెలిసి నిన్నటి నుంచి పోలీసులు పలు విధాలుగా తమను అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. తమ వాళ్లను ఎక్కడికక్కడ హౌస్ అరెస్ట్ చేశారని అన్నారు. వైసీపీ నేతల ట్రాప్ లో పోలీసు అధికారులు పడొద్దని సూచించారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేదని విమర్శించారు.

# న్యూఢిల్లీలో మొట్టమొదటి ఖేలో ఇండియా పారా గేమ్స్

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:తొలిసారిగా ఖేలో ఇండియా పారా గేమ్స్ న్యూఢిల్లీలో డిసెంబర్ 10న ప్రారంభం కానున్నాయి. పారా ఖేలో ఇండియా గేమ్స్ న్యూఢిల్లీలో డిసెంబర్ 10 నుండి డిసెంబర్ 17 వరకు నిర్వహించబడుతున్నాయి.

32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు పాటు సర్వీసెస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్‌ల నుండి మొత్తం 1350 మంది ఆటగాళ్లు ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో పాల్గొంటున్నారు. పారా అథ్లెటిక్స్, పారా షూటింగ్, పారా ఆర్చరీ, పారా ఫుట్‌బాల్, పారా బ్యాడ్మింటన్, పారా టేబుల్ టెన్నిస్ మరియు పారా వెయిట్ లిఫ్టింగ్ వంటి 7 విభాగాల్లో క్రీడాకారులు పోటీ పడతారు. ఈ క్రీడలు 3 సాయ్ స్టేడియాలైన తుగ్లకాబాద్ ఐజీ స్టేడియం షూటింగ్ రేంజ్ మరియు జెఎల్ఎన్ స్టేడియంలో నిర్వహిస్తారు.

పారా ఖేలో ఇండియా గేమ్స్ గురించి శ్రీ అనురాగ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మొట్టమొదటి ఖేలో ఇండియా పారా గేమ్స్ అన్నింటికంటే తాదాత్మ్యంతో కూడిన సమగ్ర సమాజాన్ని సృష్టించే మరియు బలోపేతం చేసే దిశగా మరో అడుగు అని అన్నారు. న్యూఢిల్లీలోని మూడు వేర్వేరు వేదికలపై వారంపాటు జరిగే ఖేలో ఇండియా పారా గేమ్స్ భావోద్వేగాల సముద్రాన్ని కనుగొనడంలో సహాయపడతాయని మరియు భారతీయ క్రీడా ప్రేమికులకు ఇప్పటివరకు తెలియని ప్రతిభను తెలుసుకుంటారని తెలిపారు.

32 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1400 మంది పారా అథ్లెట్లు ఢిల్లీలో సమావేశమవడం చాలా సంతోషకరమని ఆయన అన్నారు. సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డ్ నుండి అథ్లెట్ల రాక ప్రారంభ పారా గేమ్‌లకు మరింత ఆకర్షనను అందిస్తుందని చెప్పారు.

ఖేలో ఇండియా ఖచ్చితంగా గేమ్ ఛేంజర్ అని ఇది క్రీడలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించిన అనేక అకాడమీలు మరియు పథకాలతో శాస్త్రీయ మరియు ఆధునిక విధానాన్ని పెంపొందించిదనికేంద్ర మంత్రి తెలిపారు.

ప్రధాన ప్రజా స్రవంతిలో దివ్యాంగులు తమ ప్రతిభను వినియోగించుకునేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో ఖేలో ఇండియా పారా గేమ్స్ కూడా సమకాలీకరించబడుతున్నాయని ఆయన అన్నారు. వృత్తి మరియు విద్యా శిక్షణ, వ్యాపారం కోసం సబ్సిడీ రుణాలు అందించడం వంటి కార్యక్రమాలు ఆర్థికం, సామాజికంగా సాధికారతకు దారితీశాయని చెప్పారు. ఖేలో ఇండియా పారా గేమ్స్ ఈ కార్యక్రమాలను పటిష్టం చేసే దిశగా మరో అడుగు వేసిందని వివరించారు.


ఆహ్వానం
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాష, సాంస్కృతిక శాఖ, సాహితీ జిగీష సంయుక్త ఆధ్వర్యంలో
గిన్నారపు ఆదినారాయణ రచించిన కవితా సంపుటి
'నానీల సుగంధం' ఆవిష్కరణ & అంకితోత్సవ సభ
ముఖ్య అతిథి, ఆవిష్కర్త
ఆచార్య ఎన్. గోపి
కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, పూర్వ వైస్ చాన్స్‌లర్, తెలుగు విశ్వవిద్యాలయం
సభాధ్యక్షులు
డా. ఎస్. రఘు
ప్రముఖ విమర్శకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం
కృతి స్వీకర్త
ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు
తెలుగుశాఖ అధ్యక్షులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
తేది : 13-12-2023, బుధవారం, సాయంత్రం 05:30 లకు రవీంద్ర భారతి, కాన్ఫరెన్స్ హాల్, మొదటి అంతస్తు, హైదరాబాద్
విశిష్ట అతిథి
డా. పి. లలితవాణి
విశ్రాంత ప్రధానాచార్యులు, కార్యదర్శి, సాహితీ జిగీష,
గ్రంథావలోకనం
డా. యం. దేవేంద్ర
తెలుగు అధ్యాపకులు, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం, కోఠి
డా. యస్. చంద్రయ్య
తెలుగు అధ్యాపకులు, నిజాం కళాశాల


# మూడువేల కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసిన నారా లోకేష్



అమరావతి, డిసెంబర్ 11:తెలుగుదేశం యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్లు పూర్తిచేసుకున్నారు.. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం రాజులకొత్తూరు వద్ద సోమవారం నాడు పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లోకేష్ తోపాటు ఆయన అర్ధాంగి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్, నందమూరి బాలకృష్ణ, తొడల్లుడు భరత్, బాలయ్య కుమారుడు మోక్షజ్ఞ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించినపృటికీ ప్రజలే సైన్యంగా యువగళం పాదయాత్ర 3 వేల కిలోమీటర్ల మైలురాయికి చేరిందన్నారు. ఈ మజిలీకి గుర్తుగా తుని నియోజకవర్గం తేటగుంట పంచాయతీలో వైసీపీ సర్కారు మూసివేసిన పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను మళ్లీ ప్రారంభిస్తామని హామీ ఇన్తూ శిలాఫలకం ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు.

ఇది ఇలా ఉంటే పైలాన్ ఆవిష్కరణ నేపథ్యంలో తేటగుంట జాతీయ రహదారి జనసంద్రంగా మారింది. అనంతరం లోకేశ్‌తో కలిసి కుటుంబ సభ్యులు అడుగులు వేశారు. యువగళం పాదయాత్ర చారిత్రాత్మక మైలురాయికి చేరుకున్న సందర్భంగా యువగళం బృందాలు ఆనందంతో కేరింతలు కొట్టాయి. వేలాదిమంది కార్యకర్తలు, అభిమానుల రాకతో జాతీయ రహదారి కోలాహలంగా మారింది. లోకేశ్‌కి సంఘీభావం తెలిసిన టీడీపీ ముఖ్యనేతలు పాదయాత్రలో పాల్గొన్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో రాజుల కొత్తూరు జనసంద్రాన్ని తరలించింది.

# వి.బి.ఎస్.వై ద్వారా లబ్ధి పొందిన ట్రాన్స్ జెండర్ స్ఫూర్తిని ప్రశంసించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:వికసిత భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారులతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలితాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా చూడాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారు.

ప్రధానమంత్రితో చండీగఢ్ నుంచి వికసిత భారత్ సంకల్ప యాత్ర లబ్ధిదారు శ్రీమతి మోనా మాట్లాడారు. జార్ఖండ్‌లోని రాంచీకి చెందిన శ్రీమతి మోనా చండీగఢ్ లో టీ స్టాల్ నిర్వహిస్తున్నారు. చండీగఢ్‌లో సాయంత్రం 6 నుండి రాత్రి 10 గంటల వరకు నడిచే టీ షాప్ నిర్వహిస్తున్నానని ప్రధానికి శ్రీమతి మోనా తెలియజేశారు.

టీ స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి పీఎంస్వానిధి పథకం ద్వారా తాను రూ. 10,000 రుణాన్ని పొందినట్లు శ్రీమతి మోనా తెలియజేశారు. రుణ సౌకర్యం సమాచారం తనకు నగర కార్పొరేషన్ ద్వారా అందిందని ప్రధానమంత్రికి శ్రీమతి మోనా తెలిపారు.

టీ స్టాల్‌లో గరిష్ట లావాదేవీలు యుపిఐ ద్వారా జరుగుతాయి కదా మరి మీకు అదనంగా అందించడానికి బ్యాంకులు ముందుకు వచ్చాయా అని ప్రధానమంత్రి ఆరా తీశారు.

ప్రధానమంత్రి ప్రశ్నకు సమాధానం ఇచ్చిన శ్రీమతి మోనా తాను తర్వాత వరుసగా రూ. 20,000 మరియు రూ. 50,000 ఋణం పొందానని తెలియజేసారు. సున్నా వడ్డీతో శ్రీమతి మోనా మూడవ దశకు చేరుకున్నందుకు ప్రధాన మంత్రి ఎనలేని సంతృప్తిని వ్యక్తం చేశారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు పొందేందుకు ట్రాన్స్ జెండర్లు మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి సూచించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సబ్కా సాథ్ సబ్కా వికాస్ విధానం వల్ల సమాజంలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని ప్రధానమంత్రి అన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా సరైన దిశలో అమలు జరుగుతున్నాయని చెప్పడానికి శ్రీమతి మోనా ఒక మంచి ఉదాహరణ అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు అస్సాం రైల్వే స్టేషన్‌లోని అన్ని దుకాణాల నిర్వహణను ట్రాన్స్‌జెండర్లకు అప్పగించాలని రైల్వే నిర్ణయించిందని ప్రధానమంత్రి ప్రకటించిన ప్రధానమంత్రి దీనివల్ల ట్రాన్స్‌జెండర్లకు ప్రయోజనం కలుగుతుందన్నారు. శ్రీమతి మోనా చేసిన కృషిని, సాధించిన విజయాలను ప్రధానమంత్రి ప్రశంసించారు.

# పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన మేకల మల్లిబాబు యాదవ్



ఖమ్మం, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి గా పొంగులేటి శ్రీనివాసరెడ్డి తొలిసారిగా ఖమ్మం వచ్చిన సందర్భంగా వారి స్వగృహంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం పాత్రికేయులతో మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ...పొంగులేటి శీనన్న గత ప్రభుత్వాన్ని ఛాలెంజ్ చేసి, అనుకున్నట్లుగా బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఓడించడం జరిగిందని ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ప్రజా హృదయనేత శీనన్నకు కీలకమైన బాధ్యతతో కూడిన శాఖలు రావడం చాలా ఆనందంగా ఉందని జిల్లా వ్యాప్తంగా యాదవ, కురుమలు, బడుగు బలహీన వర్గాల వారు గత ప్రభుత్వ హయాంలో నిరంకుశ విధానాల వల్ల మోసపోయిన వారు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ గెలుపుతో భరోసాతో ఉన్నారని పొంగులేటి అభిమానులు కార్యకర్తలు చాలా సంతోషంగా ఉన్నారని హర్షం ప్రకటించారు. ఓటమిపాలైన వారు ఆవేశంతో రెచ్చగొట్టే విధంగా కార్యక్రమాలు చేసే అవకాశం ఉందని అందరూ సంయమనం పాటించాలని అక్కడికి వచ్చిన సందర్శకులకు శీనన్న సూచించారని మల్లిబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, ప్రముఖ డాక్టర్ గోంగూర వెంకటేశ్వరరావు, కామేపల్లి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# ఏపీకి ప్రత్యేక హోదా, ప్యాకేజీపై కేంద్రం మళ్లీ మొండిచేయి

న్యూఢిల్లీ డిసెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏపీకి ప్రత్యేక హోదా, ప్యాకేజీపై కేంద్రం మళ్లీ మొండిచేయి ఇచ్చింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరిని లోక్‌సభలో కొంతమంది టీడీపీ, వైసీపీ ఎంపీలు కలిసి ఏపీకి రావాల్సిన ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీపై ప్రశ్నించగా ఆయన దాటవేసినట్లు తెలుస్తోంది. అయితే ఏపీతో పాటు మహారాష్ట్ర ఎంపీలు కూడా పంకజ్ చౌదరిని కలిసినట్లు సమాచారం. గత ఐదేళ్లలో ఏ రాష్ట్రానికీ ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని ఆయన తోసిపుచ్చారు .కాగా.. కోవిడ్-19 దృష్ట్యా మూలధన వ్యయంలో పలు రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించే పథకాన్ని మాత్రం కేంద్రం అమలు చేసింది. ఇందులో భాగంగా 50 ఏళ్లలో తిరిగి చెల్లించేలా వడ్డీ లేని రుణాన్ని సమకూర్చినట్లు తెలుస్తోంది. ఈ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2020-21లో రూ. 688 కోట్లు, 2021-22లో 501.79 కోట్లు, 2022-23లో 6105.56 కోట్లు కేంద్రం విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్రానికి 2020-21లో రూ. 358 కోట్లు, 2021-22లో 214.14 కోట్లు, 2022-23లో 2500.98 కోట్లు విడుదల చేసింది.

# కొమురవెల్లి మల్లన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 11 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో మల్లన్న క్షేత్రాన్ని, జనగామ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని, స్వామి కృపతో తాను అద్భుత విజయం సాధించానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం మొదటిసారిగా సోమవారం ఆయన కొమురవెల్లి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం ఆలయ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. జనవరి 7న జరిగే కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని, స్వామి వారి ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. అలాగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, వసతుల పై త్వరలో ఆలయవర్గాలతో పాటు ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ సర్కారు పాలనలో కొమురవెల్లి మల్లన్న క్షేత్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. క్షేత్రంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న పనుల పై త్వరలో సమీక్ష జరిగి వాటిని సకాలంలో పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటునాని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తలారీ కీర్తన, జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మల్లన్న ఆలయ మాజీ చైర్మన్లు మేక సంతోష్, గీస భిక్షపతి, పీఏసీఎస్ చైర్మన్ వంగ చంద్రారెడ్డి, సర్పంచ్ సార్ల లత తదితరులు ఉన్నారు.

# శబరిమల ఆలయం వద్ద అపశృతి.. 11 ఏళ్ల బాలిక మృతి

కేరళ డిసెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):కేరళ లోని ప్రముఖ పుణ్యక్షేత్రం శబరిమల ఆలయం వద్ద అపశృతి చోటుచేసుకుంది. దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఓ 11 ఏళ్ల బాలిక ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయింది. సుదీర్ఘ సమయం క్యూలైన్‌లో వేచి ఉన్న బాలిక ఒక్కసారిగా కుప్పకూలింది. వెంటనే అప్రమత్తమైన ఆలయ అధికారులు.. బాలికను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందింది. బాలిక గత మూడేళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిసింది.మరోవైపు శబరిమల ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోంది. దీంతో కొండ మొత్తం అయ్యప్ప భక్తులతో కిక్కిరిసిపోతోంది. క్యూలైన్లో ఎక్కువ సమయం నిరీక్షించలేక చాలా మంది యాత్రికులు క్యూ వ్యవస్థను అతిక్రమించి బారికేడ్‌లను దూకేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కారణంగా పవిత్ర మెట్ల దగ్గర రద్దీ అధికంగా పెరుగుతోంది. రద్దీ ఎక్కువగా ఉండటంతో అధికారులు కూడా భక్తులను నిలువరించలేక పోతున్నారు. ఈ పరిస్థితులు అక్కడ గందరగోళానికి కారణమవుతున్నాయి.ఇదిలా ఉండగా.. విపరీతమైన రద్దీ పెరుగుదలపై కేరళ మంత్రి రాధాకృష్ణన్, ట్రావెన్‌కోర్ బోర్డు అధ్యక్షుడు ప్రశాంత్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వర్చువల్ క్యూ బుకింగ్ పరిమితిని 10,000 తగ్గించారు. అంతేకాకుండా రోజువారీ గరిష్ఠ భక్తుల సంఖ్య పరిమితిని 90 వేల నుంచి 80 వేలకు కుదించారు. అదేవిధంగా భద్రతా చర్యలను పటిష్ఠం చేయడంలో భాగంగా సన్నిధానం వద్ద ప్రత్యేక రెన్యూ అంబులెన్స్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కేరళ ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. ఏవైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే తక్షణమే వైద్య సేవలు అందజేయనున్నట్టు వెల్లడించారు.కాగా, రెండు నెలల పాటు సాగే దర్శనాల్లో భాగంగా శబరిమల అయ్యప్ప ఆలయం గత నెల 17వ తేదీ నుంచి తెరుచుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మండల- మకరవిళక్కు వేడుకలు 17వ తేదీ నుంచే ప్రారంభమయ్యాయి. దీంతో మండల పూజల కోసం శబరిమల ఆలయాన్ని అధికారులు తెరిచి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. దీంతో అయ్యప్ప దర్శనం కోసం కేరళ నుంచే కాకుండా పొరుగున ఉన్న తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు శబరిమల కొండకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో అక్కడ విపరీతమైన రద్దీ నెలకొంటోంది.

# భట్టిని ఆకట్టుకున్న బీపీ నాయక్ అభినందనలు

## - బీపీ నాయక్ ఆలోచన భేష్ అని కితాబు

ఖమ్మం, డిసెంబర్ 11:(నేటి నిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఉ



ప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని, వైరా శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నేత బీపీ నాయక్. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి, పేద పిల్లల చదువులకు ఉపయోగపడే పాఠ్య పుస్తకాలను బహూకరించారు. వారి నాయకత్వంలో రాష్ట్రం పురోగతి చెందాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని అభిలాషించారు.

# కెసిఆర్‌కు ప్రకాశ్ రాజ్ ,ప్రవీణ్ కుమార్, చంద్రశేఖర అజాద్ పరామర్శ..

హైదరాబాద్, డిసెంబర్ 11:యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు పలువురు సెలబ్రిటిస్ పరామర్శించారు.. నేటి ఉదయం సినీ నటుడు ప్రకాశ్ రాజ్ యశోద హాస్పటల్ కు వెళ్లి కెసిఆర్ని కలిశారు..అయన ఆరోగ్య పరిస్థితి గురించిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , ఎమ్మెల్సీ కవిత ను ఆడిగి తెలుసుకున్నారు..కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రకాశ్ రాజ్ ఆకాంక్షించారు

ఇక భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ , బీఎస్పీ తెలంగాణ చీఫ్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత,ఎమ్మెల్సీలు మధుసూదన చారి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, బీఆర్ఎస్ నాయకుడు చల్మడ లక్ష్మి నరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# అయ్యప్ప స్వాములకు అన్నదానం



మెదక్, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి ):మెదక్ పట్టణంలోని అయ్యప్పదేవాలయంలో, అయ్యప్ప మాల ధారణ స్వాములకు మండల కాలం(41 రోజులు) పాటు నిత్యఅన్నదాన మరియు అల్పాహారం కార్యక్రమం నిర్వహిస్తున్న ,దాత ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి గారు ఈరోజు (సోమవారం) మధ్యాహ్నం అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి, అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గారితో ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు.అనంతరం నిత్యాన్నదాన మరియు నిత్య అల్పాహార సంబంధిత రుసుమును నిర్వాహకులకు ఎమ్మెల్సీ గారు అందజేశారు. మరియు అందరు స్వాములకు దక్షిణ అందజేసి పాదాభివందనం చేశారు. ఆలయ కమిటీ నాయకులు మరియు నిర్వాహకులు ఎమ్మెల్సీ గారిని శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గారితో పాటు సర్పంచులు దేవా గౌడ్, మహిపాల్ రెడ్డి, యామి రెడ్డి, సాయా గౌడ్, శ్రీను నాయక్, ఎంపిటీసీ సిద్దిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పురం వెంకట నారాయణ,ఏఎంసీ డైరెక్టర్ కొండా శ్రీను, తదితరులు ఉన్నారు.

# ఎంపీ వద్దిరాజు ప్రత్యేక పూజలు

ఖమ్మం, డిసెంబర్ 11:(నేటి నిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఖమ్మం ఎన్ఎస్పీ క్యాంపులోని సీతా రామాంజనేయ, కాల్వొడ్డున ఉన్న గుంట మల్లేశ్వర స్వాముల ఆలయాలను సందర్శించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఎంపీ రవిచంద్ర, తన సన్నిహితులు మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గణేష్ లతో కలిసి, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. వేద పండితులు పూలమాలలు, కండువాలతో వారిని సత్కరించి ఆశీర్వచనాలు పలికారు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేసేందుకు లక్ష రూపాయలు అందించారు.

# అనాథ పిల్లలకు అండగా పల్లా కిరణ్



ఖమ్మం, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరంలోని స్థానిక పోలియో హోమ్ లో సిఎస్ఐ డాయాసిస్ వారి గర్ల్సడబాయ్స్ హాస్టల్లో నివసిస్తున్న అనాథ బాలికలకు చలి తీవ్రతను తట్టుకునే విధంగా రగ్గులు, కొత్త బట్టలు, పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్స్, అమ్మాయిలకు అవసరం అయిన నిత్యవసర వస్తువులు పంపిణీ చేసి మరోసారి మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్ కుమార్. ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ...ఇకముందు కూడా వారికి అన్ని విధాలుగా అండగా ఉంటానని చదువే మీ అందరికీ పెద్ద ఆయుధమని చదువు ద్వారా మీరు ఉన్నత స్థాయికి చేరుకోగలరని ధైర్యాన్ని ఇచ్చారు. అదేవిధంగా ఒక అన్నయ్య లాగా ఎల్లవేళలా తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు.

# సంగారెడ్డి జిల్లాలో విషాదం.. వ్యవసాయ బావిలో పడి యువకుడు మృతి

జహీరాబాద్, డిసెంబర్ 11: కుటుంబ తగాదాలతో మనస్థాపం చెందిన ఓ యువకుడు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు ఈ విషాదకర సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..తండాకు చెందిన రాథోడ్ సందీప్ (23) కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు.

దీంతో మనస్థాపం చెందిన సందీప్ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తండా వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఒక బాబు, పాప ఉన్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబా సభ్యుల ఫిర్యాదు మేరకు జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. సందీప్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# 370వ అధికరణాన్ని రద్దు చేయడంపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తరువు చరిత్రాత్మకంగా ఉంది: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:మూడు వందల డెబ్బయ్యో అధికరణాన్ని రద్దు చేయడం పై సర్వోన్నత న్యాయ స్థానం యొక్క నిర్ణయం చరిత్రాత్మకమైంది గా ఉంది, అంతేకాదు 2019 వ సంవత్సరం లో ఆగస్టు 5వ తేదీ నాడు భారతదేశం యొక్క పార్లమెంటు ద్వారా తీసుకొన్న టువంటి నిర్ణయాన్ని రాజ్యాంగబద్ధంగా పరిరక్షించింది కూడా ను అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.న్యాయస్థానం తనకు గల అపారమైనటువంటి జ్ఞానం తో ఏకత్వం యొక్క సారాన్ని బలపరచిందని, భారతదేశం లో పౌరులు గా ఉన్నటువంటి మనం ఏకత్వాన్ని మిగతా అన్ని అంశాల కన్నా ఎంతో ఉన్నత మైంది గా భావిస్తామని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు."ఆర్టికల్ 370వ అధికరణాన్ని రద్దు చేయడం పై సర్వోన్నత న్యాయస్థానం ఈ రోజున వెలువరించిన ఉత్తరువు చరిత్రాత్మకం గా ఉండడం తో పాటు గా 2019 వ సంవత్సరం లో ఆగస్టు 5 వ తేదీ నాడు భారతదేశం యొక్క పార్లమెంటు ద్వారా తీసుకొన్న నిర్ణయాన్ని రాజ్యాంగ బద్ధం గా పరిరక్షించింది; ఇది జమ్ము, కశ్మీర్ మరియు లద్దాఖ్ ల లోని మన సోదరీమణుల మరియు మన సోదరులకు ఆశ, ప్రగతి, ఇంకా ఏకత్వాల తాలూకు తిరుగులేని అటువంటి ప్రకటన గా కూడా ను ఉంది. న్యాయస్థానం తన అపారమైనటువంటి జ్ఞానం తో, ఏకత్వం యొక్క మూల సారాన్ని బలపరచింది. భారతదేశం లో పౌరులు గా మనం ఏకత్వం యొక్క మూల సారాన్ని మిగిలిన అన్నింటి కంటే అన్నింటి కంటే ప్రియమైంది గాను మరియు ఉన్నత మైంది గాను భావిస్తాం.అనేక విపత్కర పరిస్థితుల ను తట్టుకొని మనుగడ సాగిస్తున్న జమ్ము, కశ్మీర్ మరియు లద్దాఖ్ లలో నివసిస్తున్న ప్రజల కు వారి యొక్క కలల ను నెరవేర్చడం పట్ల మన నిబద్ధత అచంచలమైంది అంటూ నేను హామీ ని ఇవ్వదలచుకొన్నాను. ప్రగతి తాలూకు ఫలాలు మీ చెంతకు చేరుకోవడం ఒక్కటే కాకుండా ఆ ప్రయోజనాల ను మన సమాజం లో 370 వ అధికరణం కారణం గా యాతనలు పడ్డ అందరి కంటే బలహీనమైన వర్గాల వారి కి మరియు నిరాదరణ కు గురి అయిన వర్గాల వారి కి సైతం అందేటట్టు జాగ్రత తీసుకోవడాని కి మనం కంకణం కట్టుకొన్నాం. ఈ రోజు న వచ్చిన తీర్పు కేవలం ఒక న్యాయాత్మకమైనటువంటి తీర్పు కాదు; ఇది ఆశ యొక్క కిరణం గా ఉంది, ఉజ్జ్వల భవిష్యత్తుకు వాగ్దానం ఇది, ఇంకా ఒక బలమైనటువంటి, ఇప్పటి కంటే ఎక్కువ ఐకమత్యం తో కూడి ఉండేటటువంటి భారతదేశాన్ని నిర్మించాలన్న మన సామూహిక సంకల్పాని కి ఇది ఒక నిదర్శన గా కూడాను. అని పేర్కొన్నారు.

# చిన్న కార్యకర్తను అత్యున్నత పదవికి ఎంపిక చేశారు : మోహన్ యాదవ్



భోపాల్, డిసెంబర్ 11: మధ్యప్రదేశ్ నూతన సీఎంగా ఉజ్జయిని సౌత్ ఎమ్మెల్యే మోహన్ యాదవ్‌ను బీజేపీ అనూహ్యంగా తెరపైకి తీసుకువచ్చింది. తనకు అప్పగించిన బాధ్యతలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని, తనకు కీలక బాధ్యతలు కట్టబెట్టిన రాష్ట్ర, కేంద్ర నాయకత్వాలకు మోహన్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

తాను పార్టీలో చిన్న కార్యకర్తనని, మీ ప్రేమాభిమానాలతో పార్టీ రాష్ట్ర, కేంద్ర నాయకత్వం అప్పగించిన బాధ్యతలను మీ ప్రేమ, ఆశీస్సులతో నెరవేర్చేందుకు తన ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. శివరాజ్ సింగ్ చౌహాన్ సారథ్యంలోని గత ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన మోహన్ యాదవ్‌ను కాషాయ పార్టీ అత్యున్నత పదవికి ఎంపిక చేసింది.

ఇక జగదీష్ దేవ్డా, రాజేష్ శుక్లాలను డిప్యూటీ సీఎంలుగా ఎంపిక చేసింది. మాజీ కేంద్ర మంత్రి నరేంద్ర తోమర్ మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇక మోహన్ యాదవ్ ఉజ్జయిని దక్షిణ్ నుంచి 2013లో తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇక 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన మరోసారి ఉజ్జయిని దక్షిణ్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇక 2020 జులైలో ఆయన శివరాజ్ చౌహాన్ కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, సోమవారం ఉదయం బీజేపీ కేంద్ర పరిశీలకులు మనోహర్ లాల్ ఖట్టర్, డాక్టర్ కే లక్ష్మణ్, ఆశా లక్రాల సమక్షంలో జరిగిన బీజేఎల్పీ సమావేశం జరిగింది.

# ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు కూడా లేదా ?

## -నియంత పాలనకు చరమగీతం పాడాలి

## -జనసేన నేతల అక్రమ అరెస్టుని తీవ్రంగా ఖండించిన నారా లోకేష్

అమరావతి డిసెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్): విశాఖలో జనసేన నేతల అరెస్ట్‌పై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్పందించారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, జనసేన నేతల అక్రమ అరెస్టుని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ప్రతిపక్షాలకు నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా చేసిన నియంత పాలనకు చరమగీతం పాడుదామని లోకేష్ పిలుపునిచ్చారు. కాగా.. విశాఖలో నోవోటల్ హోటల్ వద్ద ఆందోళన చేస్తున్న జనసేన నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.నాదెండ్ల మనోహర్, పంచకర్ల రమేష్ బాబు, కోన తాతారావు సహా పలువురు జనసేన నేతలు హోటల్ వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం... దొంగల రాజ్యం తోపిడి రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనసేన నేతలు నినాదాలు చేశారు. హలో ఏపీ... బై బై వైసీపీ అంటూ నోవాటల్ వద్ద నినాదాలు హోరెత్తాయి. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు

# మహిళలు వారి స్థానిక వ్యవసాయ సరఫరా కోసం నమో డ్రోన్ దీదీ పథకం సాయపడుతున్నది: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:నమో డ్రోన్ దీదీ పథకం యొక్క ప్రాముఖ్యాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ పథకం మహిళలకు సాయపడుతూ, వారు స్థానిక వ్యవసాయ సంబంధి సప్లయ్ చైన్ లలో స్టేక్ హోల్డర్స్ గా మారేందుకు మరియు గ్రామీణ సమృద్ధి లో భాగం పంచుకొనేందుకు దోహద పడుతోంది అని ఆయన అన్నారు.కేంద్ర మంత్రి డాక్టర్ శ్రీ మన్‌సుఖ్ మాండవియా వ్రాసిన ఒక వ్యాసాన్ని ఉదాహరిస్తూ, ప్రధాన మంత్రి ఎక్స్ మాధ్యం లో నమోదు చేసిన ఒక సందేశం లో -"మహిళలు వారి స్థానిక వ్యవసాయ సంబంధి సప్లయ్ చైన్ లలో స్టేక్ హోల్డర్స్ గా మారేందుకు నమో డ్రోన్ దీదీ పథకం ఏ విధం గా వారి కి సాయపడటానికి ఉద్దేశించింది అని పేర్కొన్నారు.



# మెలకువలతో కందిసాగు చేస్తే అధికంగా దిగుబడులు

## -రైతులకు జిల్లెల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల సూచనలు

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 11: మెలకువలతో కందిసాగు చేస్తే అధిగా దిగుబడులు పొందవచ్చని జిల్లెల్ల గ్రామంలోని బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల అనుభవ పూర్వక అభ్యాస విద్యార్థులు తెలిపారు.

మంచి యాజమాన్యంతో పంటను సాగు చేయడం వలన రైతులు సుమారు ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి సాదించవచ్చుని, అనిస్థిత వర్షపాతం,మారుక మచ్చల పురుగు, శనగపచ్చ పురుగు వీటన్నింటిని అధిగమిస్తూ మంచి యాజమాన్య మెలకువలతో కందిని సాగు చేసుకునే అవకాశముందని సూచించారు. వరంగల్ కంది-1 (డబ్ల్యుఆర్జి-97),వంటకాలం శ150-160 రోజులురి ఎందుతేగులును తట్టుకునే ప్రాముఖ్యత కలిగిన కందిని విద్యార్థులు సాగు చేశారు. వీరు ఒక్క ఎకరానికి 3 కిలోల చొప్పున 2 ఎకరాలకు గాను 6 కిలోల విత్తనాన్ని ఉపయోగించారు. కంది పంటలో విత్తన శుద్ధి అనేది ముఖ్యమైన అంశంగా తెలియచేస్తూ మొదటగా కార్బెండజిమ్ 1 కిలో విత్తనానికి 3 గ్రాములు చొప్పున పట్టించి ఆరబెట్టిన తర్వాత 1 కిలో విత్తనానికి 200 గ్రాములు రైజోబియంని ఉపయోగించి విత్తన శుద్ధి చేయడం వలన వేరు బుడిపెల్లో నత్రజని ప్రక్రియ జరిగి మొక్కకు నత్రజనిని అందిస్తుంది. విత్తనం ద్వారా వచ్చే వ్యాదులను తగ్గించి దిగుబడిని పెంచుతుంది. వానాకాలం కంది ఎర్రచల్కా భూమిలో సాలుకు సాలుకు మధ్య 90 సెంటీమీటర్లు మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్లు ఉండేలా విత్తుకోవాలి . దీనివల్ల మొక్క సాంద్రతను నిర్వహించే అవకాశం ఉంటుంది. మొగ్గదశ, కాయలు ఏర్పడే దశలలో నీరు ఎక్కువైనా లేదా బెట్టుకు గురైన పుత మరియు కాయ రాలిపోతుంది. అందువలన కీలకదశల్లో నీటి యాజమాన్యం, కలుపు నివారణ కంది పంటకు తప్పనిసరి.కందికి వివిధ దశలలో నష్టం కలగజేసే చీడపీడలు వ్యాపిస్తాయి. వీటిలో శనగపచ్చ పురుగు మరియు రెక్కల పురుగు ప్రధానమైనవి .వీటి నివారణకు గాను



పూత దశలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లింగాకర్షక బుట్టలను మరియు ఎమామెక్టిన్ బెంజోయేట్ 8 గ్రాముల చొప్పున 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడంవలన అధిక దిగుబడిని 1 ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడిని పోందవచ్చని తెలిపారు. ఈ అనుభవ పూర్వక అభ్యాస కార్యక్రమనికి కార్య నిర్వణాధికారిగా డా.జి శ్రీదేవి (అసోసియేట్ డీన్), మేనేజింగ్ డైరెక్టర్గా డా.కెపి వాణి, ప్రొఫెసర్ (అగ్రానమి), డైరెక్టర్ గా డా టిఅరుణ్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ (అగ్రానమి) వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో చివరి సంవత్సరం చదువుతున్నా విద్యార్థులు రేవంత్, సాయికిరణ్, రాజవర్ధన్, శ్రీ హర్ష, శిరీష, శ్రీవిద్య, ప్రీతి నాయక్ పాల్గొన్నారు.

# రుణ మాఫీ ఆఫర్ ప్రకటనల వలలో పడొద్దు.. ప్రజలకు ఆర్బీఐ హెచ్చరిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 11:రుణ మాఫీ ఆఫర్ల పేరిట వార్తా పత్రికలు, సోషల్ మీడియా వేదికల్లో వస్తున్న వాణిజ్య ప్రకటనలను నమ్మి మోసపోవద్దని ప్రజలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) హెచ్చరించింది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో తీసుకున్న రుణాలు మాఫీ అవుతాయంటూ కొన్ని సంస్థలు చేస్తున్న ప్రచారం ఆర్బీఐ దృష్టికి వచ్చింది. దీంతో అటువంటి అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించింది.

'రుణ మాఫీ ఆఫర్లంటూ కొన్ని సంస్థలు వార్తాపత్రికల్లో, సోషల్ మీడియా వేదికలపై విస్తృతంగా ప్రచారం చేస్తూ.. సర్వీస్ లేదా చట్టపరమైన ఫీజు పేరిట నగదు వసూలు చేసిన రుణ మాఫీ ధ్రువ పత్రాలు జారీ చేస్తున్నాయి. ఇలా ధ్రువ పత్రాలు జారీ చేసేందుకు సదరు సంస్థలకు అనుమతి లేదు' అని ఆర్బీఐ తెలిపింది.'ప్రజలు తీసుకున్న రుణాలు సదరు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తిరిగి చెల్లించనవసరం లేదని వినియోగదారులకు చెబుతున్నాయి. ఇటువంటి ప్రచారం వల్ల బ్యాంకులు, ఆర్థిక సంస్థల స్థిరత్వం, డిపాజిటర్ల ప్రయోజనాలు దెబ్బ తింటాయి. అసత్య ప్రచారం చేస్తున్న సంస్థలతో సంబంధాలు కలిగి ఉండటం వల్ల ఆర్థికంగా నష్టపోతారు. కనుక ఇటువంటి ప్రకటనలను నమ్మకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి' అని ఓ ప్రకటనలో ప్రజలకు ఆర్బీఐ సూచించింది.

# 'విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్' పేద విద్యార్థులకు స్కాలర్షిప్లు




హైదరాబాద్ డిసెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హైదరాబాద్ పద్మారావు నగర్ పద్మనాభ రెసిడెన్సి కార్యాలయంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో 'విశ్వకర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్' హైదరాబాద్ వారు తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు పేద విద్యార్థులకు స్కాలర్షిప్పు అందజేశారు1.కొండూరి సాయి ప్రీతి, ఇంటర్, వరంగల్, 20,000/-,2.లక్కోజు త్రిష, బి ఎస్ సి, తణుకు, 25,000/-,3.దాసోజు సాయి లక్ష్మి, 7వ తరగతి, హైదరాబాద్, 20,000/-రూపాయలు ఈ సేవా కార్యక్రమం లో ఫౌండేషన్ చెర్ పెర్సన్ గొల్తి శైలజ మల్లికార్జున రావు, అధ్యక్షులు చింతాడ నరేంద్ర కుమార్, గౌరవ సలహాదారులు ఖఎఖీఐ ప్రసాద్, కమిటీ నుండి వింజరపు గోవింద రావు, ఇతర సభ్యులు, అతిధిగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంగారు తాతారావు మాట్లాడుతూ కీ.శే. డాక్టర్ గొల్తి మల్లికార్జున రావు గారి వారసత్వంగా తెలుగు రాష్ట్రాల్లో పేద విద్యార్థులకు అమూల్యమైన సేవలు అందజేస్తున్నవి.కె.ఎఫ్.ఎస్.టి సేవా సంస్థకు వెస్సో తరఫున అభినందనలు తెలిపారు. విద్యార్థుల కోరికను విద్యా సంవత్సరం మధ్యలో తెలియ చేసినప్పటికీ, తమ కోరికను అంగీకరించి పేద విద్యార్థులకు స్కాలర్షిపప్పు అంద చేసినందుకు వెస్సో తరఫున బంగారు తాతారావు ఫౌండేషన్ వారికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్కు వేములవాడ కాంగ్రెస్ నాయకుల సన్మానం



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని వేములవాడ కాంగ్రెస్ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాగరం వెంకటస్వామి, మాజీ టెస్ట్ బోర్డు మెంబర్ అరుణ్ తేజ చారి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంట్యాల ప్రకాశం సోమవారం సిద్దిపేటలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ కు రాజన్న కండువా కప్పి, ప్రసాదం అందజేసి పుష్పగుచ్చాలతో ఘనంగా సన్మానం చేశారు.

# ఏపీలో పోలీసుల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది

అమరావతి డిసెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):: ఏపీలో పోలీసుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వ్యాఖ్యానించారు. సోమవారం నాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... పాలు పోసి పెంచిన పాము వారినే కాటేసినట్లు పోలీసుల పరిస్థితి ఉంది. రాయచోటి సర్కిల్ ఇన్స్పెక్టర్ అనిల్ని వైసీపీ నాయకులు చితకబాదితే రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఏం చేస్తోంది. గతంలో ప్రతిపక్షాలమీద మీసం మెలేసి తొడగొట్టిన అసోసియేషన్ నేడు ఏమైంది. అధికార పార్టీ వారితో గొడవలెందుకని సీఐని పోలీసు పై అధికారులు సర్ది చెప్పడం అమానుషం. వైసీపీ గూండాల దాడి నుంచి కడప ప్రజలను ఎవరు కాపాడుతారు. సీఐకి రక్షణ కావాలని ఆయన భార్య శ్వేత 100 నెంబర్ కి ఫోన్ చేసి సహాయం చేయమనడం సిగ్గుచేటు" అని వర్ల రామయ్య తెలిపారు.

# ఆర్టికల్ 370 పై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం..

## -బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): ఆర్టికల్ 370 పై సుప్రీంకోర్టు సంచలన తీర్పుపట్ల బిజెపి కరీంనగర్ జిల్లా పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నామని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. ముఖ్యంగాఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ జమ్మూ-కాశ్మీర్ పార్టీలుకూటమిగాఏర్పడ్డాయన్నారు. భారతదేశంలో జమ్మూ కాశ్మీర్ కూడా అంతర్భాగమేనని, దేశంలో రెండు రాజ్యాంగ విధానాలు అమలయ్యేలా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన 370 ఆర్టికల్ ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. జమ్మూ కాశ్మీర్లోని స్వార్థ అవకాశవాద ,రాజకీయ పార్టీలు కేంద్ర నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గుప్కార్ అలయన్స్ పేరుతో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయన్నారు.పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం,భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్తో కూడిన ధర్మాసనం విచారణచేపట్టిం దన్నారు.సుదీర్ఘంగా విచారణ జరిపిన ధర్మాసనం,2019 ఆగస్టు 5న ఆర్టికల్ 370 రద్దు చేస్తూ పార్లమెంట్ తీసుకున్న నిర్ణయం సబ బేనని , ఇందులో జోక్యం చేసుకోలేమని తీర్పునీవ్వడం హర్షనీయమన్నారు. జమ్ము కాశ్మీర్ లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తూ , శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, తీవ్రవాదాన్ని ఇన్నేళ్లుగా అక్కడి కొన్నిరాజకీయ పార్టీలు పెంచి పోషించాయన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో అక్కడ ఉనికి కోల్పోయిన రాజకీయ పార్టీలు , అల యన్స్ గా ఏర్పడి సుప్రీంకోర్టులో కేసు



వేసిన వారందరికీ నేడు చెంపపెట్టు లాంటి తీర్పు వచ్చిందన్నారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో నాటి కాంగ్రెస్ చేసిన తప్పిదాలను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సరిచేసిందని, జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమేనన్నారు.

# రైతుబంధుపై అగ్రహారం డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు సర్వే



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు రైతుబంధుపై సోమవారం సర్వేను చేపట్టారు. 'ఇంపాక్ట్ అఫ్ రైతుబంధు స్కీమ్ ఆన్ ఫార్మర్స్ - ఏ స్టడీ ఆఫ్ రాజన్న సిరిసిల్ల డిస్ట్రిక్ట్' అనే అంశంపై కామర్స్ విద్యార్థులు వి సుష్మ, ఎం లహరిక, జి యశ్వంత్, కే రాజేష్, పి అనిరుద్ లు కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం మల్లారెడ్డి పర్యవేక్షణలో స్టడీ ప్రాజెక్ట్ ను రూపొందిస్తున్నారు. దీనిలో భాగంగా సిరిసిల్ల జిల్లాలోని రగుడు, సుద్దాల, లింగంపల్లి, తంగళ్ళపల్లి గ్రామాలలోని రైతులను కలిసి, ప్రశ్నావళి ద్వారా సర్వేను చేపట్టి వారి స్పందనను సేకరించారు. రైతుబంధు సకాలంలో పొందుతున్నారా, రైతుబంధు సొమ్ము పెట్టుబడి ఖర్చులకు సరిపోతుందా, ఇంకా పెంచాలా, రైతుబంధు ద్వారా వ్యవసాయాదాయం ఎంత మేరకు పెరిగింది, వ్యవసాయ రుణాలు తగ్గాయా, రైతుబంధు సొమ్ముకు పరిమితి విధించాలా, కౌలు రైతులకు రైతుబంధు సొమ్ము చెల్లించాలా అనే వివిధ ప్రశ్నలకు రైతుల స్పందనను సేకరించారు. ఈ విధంగా సేకరించిన దత్తాంశాన్ని వివిధ గణాంక పద్ధతుల ద్వారా విశ్లేషించి ప్రాజెక్ట్ రిపోర్ట్నురూపొందించి రాష్ట్రస్థాయి పోటీలకు సమర్పించనున్నట్లు తెలిపారు. సర్వేను చేపట్టిన కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం మల్లారెడ్డి, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, జిజ్ఞాస సమన్వయకర్త డాక్టర్ అఫ్సారి ఉస్మాని, అకాడమిక్ సమన్వయకర్త మధు , ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ వి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు డాక్టర్ ఎన్ రమాదేవి, డాక్టర్ ఎం ప్రభాకర్, కే రాజేష్ డాక్టర్ ఎన్ శ్రీనివాసులు, డాక్టర్ కే వై కరుణ, వై నారాయణ, వై నరసయ్య ఏవో అంజాద్ అలీ తదితరులు అభినందించారు.

# వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

## వీఆర్ఏజేఏసీ తొర్రూర్ డివిజన్ అధ్యక్షులు దూగుంట్ల శ్రీనివాసరావు.



మహబూబాబాద్:వీఆర్ఏల సమస్యలు పరిష్కరించి, ఐడి కార్డులు అందజేసి,ప్రతినెల వేతనాలు అందించెలా వీఆర్ఏలను ఆదుకోవాలని వీఆర్ఏజేఏసీ తొర్రూరు డివిజన్ అధ్యక్షులు దూగుంట్ల శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గ శాసన సభ్యురాలుగా ప్రమాణ స్వీకారం చేసి నియోజకవర్గంలోని తొర్రూరు డివిజన్ కేంద్రానికి తొలిసారి వచ్చిన సందర్భంగా వీఆర్ఏ జేఏసీ తొరూరు డివిజన్ కమిటీ యశస్విని రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 23 వేల మంది వీఆర్ఏలను వివిధ శాఖలలోకి పురమాయించి కనీసం ఆ శాఖల తరఫున ఐడి కార్డులు కూడా అందజేయకపోవడమే కాకుండా జీతాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నూతన ప్రభుత్వం వీఆర్ఏల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు .వినతి పత్రం తీసుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే ఝాన్సీ యశస్విని రెడ్డి స్పందించి మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకునేలా నా వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ జేఏసీ నాయకులు మురళీ, ఉపెంద్ర, నవీన్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ వసతి గదులపై పెంచిన జీఎస్టీ తగ్గించాలి

## -ఈవో కార్యాలయం ముందు బిజెపి నాయకుల ధర్నా



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజన్న ఆలయ వసతి గదులపై పెంచిన జీఎస్టీ వెంటనే తగ్గించాలని పట్టణ బిజెపి అధ్యక్షుడు, కౌన్సిలర్ సంతోష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ఈవో కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేపట్టారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బిజెపి అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ దేవాలయాన్ని ఆదాయ వనరుగా మాత్రమే చూస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వసతి గదులపై జీఎస్టి తగ్గించాలని కోరారు. ఈవో కృష్ణ ప్రసాద్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి హన్మండ్లు బిల్లా కృష్ణ నామాల శేఖర్ అన్నారం శ్రీనివాస్ మల్లేశం బిజెపి నాయకులు పాల్గొన్నారు.


## ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
మరియు పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో
జి. ఉమామహేశ్వర్ కథల సంపుటి
నెమలీకలు-నెమరువేతలు




పరిచయ సభ
అధ్యక్షులు
డా. ఏనుగు నరసింహారెడ్డి
ముఖ్య అతిథి
సమ్మెట ఉమాదేవి
విశిష్ట అతిథి
మామిడి హరికృష్ణ
గౌరవ అతిథి
సుధాకర్ నీల్
ఆత్మీయ అతిథులు
కోడూరి విజయ్కుమార్
గుడిపాటి
వేదిక: రవీంద్రభారతి మినీహాలు, హైదరాబాద్
తేదీ: ఆదివారం, 17 డిసెంబర్ 2023
ఉదయం 10.30 గంటలకు
అందరూ ఆహ్వానితులే



కొత్త శీర్షిక

## ఈ వారం కొత్త కథ

త్వరలో నేటి నిజం దిన పత్రికలో
**'ఈ వారం కొత్త కథ'** శీర్షిక
ప్రారంభిస్తున్నాము.

మీ కథలు యూని కోడ్ ఫాంటులో గాని,
డిటిపి చేసి ఒపెన్, ఫైలుతో పాటు
పిడిఎఫ్ ఫైల్ గాని పంపండి.

ప్రచురించిన కథకు విశాల సాహితి
**300 రూపాయలు** పారితోషికం.
బహుమతిగా అందజేస్తుంది.

ఈ శీర్షిక నిర్వహించుటకు
సుప్రసిద్ధ సీనియర్ రచయిత
**బి. ఎస్.రాములు**గారు అంగీకరించారు.
-సంపాదకులు

'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి. 169, జవహర్నగర్, హైదరాబాద్-500 020


# మాస్టర్ మెంటర్స్ జియో ఎనేబ్లింగ్ ఇండియన్ స్కాలర్స్ ప్రోగ్రామ్ కోసం..

## సెంటర్ ఫర్ నాలెడ్జ్ సావరిన్టీ, ఎస్రీ ఇండియా భాగస్వామ్యం




హైదరాబాద్, డిసెంబర్ 11: భారతదేశాన్ని జియోస్పేషియల్ టెక్నాలజీ స్కిలింగ్, ఇన్నోవేషన్ హబ్గా మార్చడమే లక్ష్యంగా మాస్టర్ మెంటర్స్ జియో-ఎనేబ్లింగ్ ఇండియన్ స్కాలర్స్ (ఎంఎంజీఈఐఎస్) ప్రోగ్రామ్ను ప్రా రంభించేందుకు సెంటర్ ఫర్ నాలెడ్జ్ సావరిన్టీ, ఎస్రీ ఇండియా చేతులు కలి పాయి. ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్ కుమార్ సమక్షంలో జ్ఞాన సార్వభౌమా ధికార కేంద్రం కార్యదర్శి వినిత్ గోయెంకా, ఎస్రీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అగేంద్ర కుమార్ ఈ ఎంవో యూపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమం ఎనిమిదో తరగతి నుంచి అండర్ గ్రాడ్యుయేట్ వరకు విద్యార్థుల ను లక్ష్యంగా చేసుకుంటుంది. లక్ష మంది విద్యార్థులను ఎనేబుల్ చేయా లనే లక్ష్యంతో ఉంది. ఇస్రో మాజీ ఛైర్మన్ కిరణ్ కుమార్ వంటి ఆవిష్క ర్తలు, డాక్టర్ కేజే రమేష్, ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్, గిరీష్ కుమార్, మాజీ సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండి యా ఈ కార్యక్రమం సమగ్ర ప్రక్రియ ద్వారా పాన్-ఇండియా ప్రతిభను వెలికితీస్తుంది. విద్యార్థులకు విజన్ చర్చలు, మాస్టర్ మెంటర్లతో పరస్పర చర్య, నిపుణులచే ఒకరితో ఒకరు మార్గదర్శకత్వం, ఇంటరాక్టివ్ కార్యక లాపాలను అందిస్తుంది. పైలట్ ప్రాజెక్ట్ జనవరి 2024లో ప్రారంభిం చను న్నారు. పూర్తి స్థాయి కార్యక్రమం 2024 జూన్ లో ప్రారంభించబ డుతుంది. ఈ సందర్భంగా సెంట ర్ ఫర్ నాలెడ్జ్ సార్వభౌమాధికారం సెక్రటరీ వినిత్ గోయెంకా మాట్లా డుతూ నైపుణ్యం కలిగిన మెంటర్కు విద్యార్థి జీవితాన్ని గణనీయంగా మార్చే శక్తి ఉంటుందన్నారు. ఎంఎం జీఈఐఎస్ ఉద్దేశ్యం.. ఈ ఆలోచనను విస్తరించడం, విద్యార్థులను ఆలోచనా పరులుగా తీర్చిదిద్దే నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి వేదికను అందించడామ అన్నారు. ఎంఎంజీఈ ఐఎస్ ద్వారా ఉత్సుకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాల ను పెంపొందించడం ద్వారా విద్యా ర్థుల వ్యక్తిగత వృద్ధిని పెంపొందిం చడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. మా పిల్లలు ఆవిష్కర్తలుగా మారడా నికి, దేశ అభివృద్ధికి అర్థవం తమైన సహకారం అందించడానికి స్ఫూర్తినిచ్చే బల మైన పునాదిని ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు.

# సరికొత్త కథనంతో సైంధవ అందర్ని మెప్పిస్తుంది

హైదరాబాద్, డిసెంబర్ 11: సరికొత్త కథ కథనంతో సైంధవ చిత్రాన్ని రూపొందించినట్లు ప్రముఖ సినీ హీరో విక్టరీ వెంకటేష్ తెలిపారు. అన్ని వర్గాల ప్రేక్షకుల మన్ననలు పొందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విక్టరీ వెంకటేష్ నటించిన 75వ చిత్రం సైంధవ మూవీ చిత్రం ప్రమోషన్స్ లో భాగంగా విజయవాడలో ఒక ప్రముఖ హోటల్లో చిత్ర బృందం సోమవారం సందడి చేసింది.

సైంధవ మూవీ ప్రమోషన్స్ లో హీరో విక్టరీ వెంకటేష్, హీరోయిన్ శ్రద్ధ శ్రీనాథ్, దర్శకుడు శైలేష్ కొలను, నిర్మాత వెంకట్ బోయినపల్లి, నూతన నటి బేబీ సారా లు పాల్గొన్నారు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానున్న సైంధవ చిత్రం విశేషాలను మీడియాతో పంచుకున్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా విడుదల కానున్న సైంధవ చిత్ర విశేషాలను హీరో విక్టరీ వెంకటేష్ వివరిస్తూ సైంధవ మూవీ కొత్త కథ, కథనం తో తెరకెక్కనుందన్నారు.



Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com